సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
గురువారం, 07.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 195
పేజీలు: 08 వెల: రూ. 5

## నామినేటెడ్ జాతర

17 కార్పొరేషన్లకు చైర్మన్లు,
11 వైస్ చైర్మన్లతో జాబితా ప్రకటన

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పండగ మళ్లీ మొదలైంది. ఇప్పటికే పలు దఫాలుగా కొన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసిన అధికార కాంగ్రెస్ పార్టీ.. తాజాగా పలు కార్పొరేషన్లకు ఛైర్మన్లను ప్రకటించింది. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బుధవారం మొత్తం 17 కార్పొరేషన్లకు చైర్మన్లు, 11 వైస్ చైర్మన్లతో జాబితా ప్రకటించారు. రాష్ట్ర గ్రామ పంచాయతీ ట్రైబ్యునల్ ఛైర్మన్ గా సూదిని రామిరెడ్డి ట్రైబ్యునల్ సభ్యులుగా నగులూరి కృష్ణకుమార్, బూసా వేణుగోపాల్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మిగతా 02లో

## కేంద్రం తీరుతో కొనుగోలు ఆలస్యం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- నిబంధనలు సడలించి కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- తడిసిన వరి ధాన్యం, మక్కజొన్నలను పరిశీలన

03



## వెయ్యి కార్లు.. 250 బస్సులు

కేంద్రమంత్రి బండి సంజయ్

- మోదీ సభకు భారీ జన సమీకరణకు ఏర్పాట్లు
- నాలుగు రోజులుగా కరీంనగర్ లో మకాం
- పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులతో మంతనాలు
- రేపటి నుంచి సికింద్రాబాద్ లో మకాం
- రేపు ముషీరాబాద్ అసెంబ్లీ నేతలతో భేటీ
- సాయంత్రం 5 గంటలకు ముఖ్య కార్యకర్తలతో సమావేశం
- ఎల్లుండి బైక్ ర్యాలీ, పాదయాత్రతో ఇంటింటికీ వెళ్లి సభకు ఆహ్వానం

03



## బయో-టెర్రర్ కుట్ర కేసు

ఎన్ఐఏ ఛార్జ్ షీట్‌లో సంచలన విషయాలు

- రిసిన్‌తో దాడి కుట్ర బహిర్గతం
- జన సమూహాలే టార్గెట్
- డార్క్ నెట్ ద్వారా శిక్షణ
- విదేశీ లింకులు వెలుగులోకి

04





## విజయ్‌కి గవర్నర్ షాక్

02


మెజార్టీ లేక టీవీకే ప్రభుత్వానికి బ్రేక్

- ప్రమాణ స్వీకారం సందిగ్ధం.. సంఖ్యాబలం కీలకం
- 118 మ్యాజిక్ ఫిగర్ దాటని టీవీకే.. రాజకీయ ఉత్కంఠ
- మద్దతు కోసం విజయ్ ప్రయత్నాలు.. కీలక పార్టీల నిరాకరణ
- తమిళనాడులో అధికార ఏర్పాటుకు అడ్డంకులు
- తదుపరి ఏం జరుగనుంది?

# వన్ షాట్?

## సీబీ'ఐ' సీఎం ప్లాన్

- కేంద్రం దగ్గర ఒత్తిడి
- ఢిల్లీ టూర్ లో ఆఫ్ ద రికార్డు వ్యూహం
- కాళేశ్వరంలోకి సీబీఐ దింపడం ఎలా?
- విద్యుత్ కొనుగోళ్లపై విచారణ జరుపాల్సిందే
- సీఎం ముందున్న అతి పెద్ద టాస్క్



**ముద్ర, తెలంగాణబ్యూరో :** కాళేశ్వరం ఫైల్ సీబీఐకి ముట్టింది. వాళ్లు కూడా వివరాలడిగారు. కానీ, ఇంకా విచారణకు దిగడం లేదు. ఇటు విద్యుత్ కొనుగోళ్ల నివేదికను పంపించారు. దాన్నింకా ముట్టుకోలేదు. ఇవి సీబీఐ స్వీకరిస్తేనే.. రాష్ట్రంలో రాజకీయంగా కాంగ్రెస్ కు వెసలుబాటు ఉండనుంది. దానికోసం సీఎం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. నిజానికి, మెట్రో అనుమతుల కోసం సీఎం రేవంత్ రెడ్డి తాజాగా ఢిల్లీకి వెళ్లినట్లు చర్చ జరుగుతున్నా.. అసలు ఈ కేసుల్లో సీబీఐని దింపేలా కేంద్ర పెద్దల దగ్గర ఒత్తిడి తీసుకువచ్చేందుకే వెళ్లారని అంటున్నారు. నిజానికి, కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై సీబీఐ విచారణ జరగాలని రేవంత్ పట్టుదలగా ఉన్నారు. అయితే సీబీఐ నుంచి ఎలాంటి సంకేతాలు రావడం లేదు. మరి ఇప్పుడేం చేయబోతున్నారనేదే ఇప్పుడు ఆసక్తి పెంచుతోంది.

### కాళేశ్వరంతో యుద్ధ తంత్రం

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన, వివాదాస్పదమైన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త యుద్ధ తంత్రాన్ని సిద్ధం చేశారు. ప్రాజెక్టు వైఫల్యాలపై కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ఈ వ్యవహారాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ ముంగిటకు చేర్చడం ద్వారా అటు బీఆర్ఎస్‌ను, ఇటు బీజేపీని ఏకకాలంలో ఇరకాటంలో పెట్టే వ్యూహానికి రేవంత్ పదును పెట్టారు. ఇప్పటికే సీబీఐకి సిఫారసు చేశారు. కానీ సీబీఐ మాత్రం అడుగులు వేయడం లేదు. రాజకీయ కక్షసాధింపు అనే ముద్ర పడకుండా, వ్యవస్థాగతమైన దర్యాప్తు ద్వారా బాధ్యులను బోనులో నిలబెట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

### విజిలెన్స్ ఆధారంగానే సీబీఐ దర్యాప్తునకు సిఫారసు

న్యాయపరమైన చిక్కులను అధిగమించే క్రమంలో రేవంత్ సర్కార్ అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తోంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు మధ్యంతర ఆదేశాలు ఇప్పుడు వచ్చాయి కానీ ముందుగానే 9 నెలల కిందట సీబీఐ విచారణ కోరుతూ పంపిన సిఫారసులో ఆ కమిషన్ ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడ్డారు. దీనికి బదులుగా, గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన ప్రాథమిక నివేదికలను, ప్రాజెక్టులో జరిగిన నిధుల మళ్లింపు ఆరోపణలను ప్రధాన ప్రాతిపదికగా చూపారు. సీబీఐ రంగప్రవేశానికి ఉన్న సాంకేతిక అడ్డంకులను తొలగించారు. మిగతా 02లో



## హైదరాబాద్ మెట్రో ఫేజ్-IIకు ఆమోదం తెలపండి

ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉండాలి

04

- ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-III కింద చేపట్టండి
- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

## మన్నె క్రిశాంక్ కు హైకోర్టు బెయిల్




- రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కేసులు వేశారని నివేదన
- పూచీకత్తులతో బెయిల్ మంజూరు చేసిన కోర్టు

03

## ఐపీఎస్ సుమతి అర్ధరాత్రి ఆపరేషన్

02



- హైదరాబాద్ లో ఆకతాయిల ఆగడాలు
- వివాదంగా మారిన ఆపరేషన్

## మోసగాడు, దొంగలు

వరంగల్ సభలో కేటీఆర్ ఫైర్..

- రేవంత్ , రాహుల్‌పై కేటీఆర్ వివాదాస్పద వ్యాఖ్యలు
- భగ్గుమన్న కాంగ్రెస్.. గట్టిగా కౌంటర్
- సీతక్క హెచ్చరికలు.. 'జోకర్ కావద్దు' అంటూ కేటీఆర్‌పై ఫైర్
- వ్యక్తిగత విమర్శలతో అసలు సమస్య పక్కదారి..
- రాజకీయాల్లో దిగజారుతున్న భాష



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించింది. వరంగల్‌లో రైతు సంగ్రామ సభ ఏర్పాటు చేసింది. ఈ సభలో ప్రభుత్వంపై విరుచుకుపడిన కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై వివాదాస్పద పదజాలం వాడటం రాజకీయ వివాదానికి దారి తీసింది. రాహుల్ గాంధీని మోసగాడు అని, కాంగ్రెస్ నాయకులను రైతు రక్తం తాగే దొంగలు అని సంబోధించారు. అంతటితో ఆగకుండా, ఎన్నికల హామీలు అమలు చేయనందుకు వారిని ఉరితీయాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి రైతులను కాంగ్రెస్ దగా చేసింది.. ఈ దొంగలను నమ్మొద్దు అంటూ కేటీఆర్ చేసిన ప్రసంగం పొలిటికల్ హీట్ పెంచింది.

### పీసీసీ కౌంటర్

కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో స్పందించారు. కేటీఆర్ తన సంస్కారాన్ని మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారం కోల్పోయిన ఫ్రస్ట్రేషన్‌లో కేటీఆర్

ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు

## కలిగించొద్దు

03


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోండి
- డీజీపీకి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్
- త్వరలో 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన

నా కాన్వాయ్ కోసం రాకపోకలకు ఆటంకం వద్దు


ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 07.05.2026
www.mudranews.in | @mudranews



### గుండె ఆరోగ్యం : నియమిత వ్యాయామం చేయండి



రోజుకు కనీసం 30 నిమిషాలు నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయడం మెదడు, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.రక్త ప్రసరణ బాగా జరిగి జ్ఞాపకశక్తి క్షీణతను తగ్గిస్తుంది.

# వన్ షాట్?

(మొదటి పేజీ తరువాయి)

**స్వయంగా చర్యలు తీసుకుంటే రాజకీయంగా బ్యాక్ ఫైర్**

రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా బీఆర్ఎస్ అగ్రనేతలపై చర్యలకు ఉపక్రమిస్తే, అది రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెట్టే అవకాశం ఉందని రేవంత్ భావిస్తున్నారు. అందుకే ఈ బంతిని కేంద్రం కోర్టులోకి విసిరారు. వేలకోట్ల ప్రజాధనం వృథా అయిన ఈ భారీ కుంభకోణంపై కేంద్రమే విచారణ జరిపించాలని కోరడం ద్వారా, బీజేపీ చిత్తశుద్ధిని రేవంత్ పరీక్షకు పెట్టారు. ఒకవేళ కేంద్రం సీబీఐ విచారణకు వెనుకాడుతే, మోదీ–కేసీఆర్ ఒక్కటే అనే ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, బీజేపీని డిఫెన్స్‌లో పడేయాలన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. రాష్ట్ర బీజేపీ నేతలకు కూడా ఒక సవాల్‌గా మారింది. సీబీఐ దర్యాప్తునకు పచ్చజెండా ఊపితే ఆ క్రెడిట్ రేవంత్ రెడ్డి ఖాతాలోకి వెళ్తుందన్న ఆందోళన వారిలో ఉంది. ఒకవేళ మౌనంగా ఉంటే బీఆర్ఎస్‌ను కాపాడుతున్నారన్న విమర్శలు మూటగట్టుకోవాల్సి వస్తుంది. ఒకవేళ విచారణ ప్రారంభమై కేసీఆర్ కుటుంబం చుట్టూ ఉచ్చు బిగుస్తే, బీఆర్ఎస్ బలహీనపడి ఆ ఓటు బ్యాంకు తమ వైపు వస్తుందని కొందరు బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. అయితే, కేంద్రంలోని అగ్రనేతల నిర్ణయంపైనే ఈ విచారణ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

**సీబీఐ డైరక్టర్ ను కలవాలనుకుంటున్న రేవంత్**

కేవలం లేఖలతోనే సరిపెట్టకుండా, స్వయంగా సీబీఐ డైరెక్టర్‌ను కలవడం లేదా మంత్రుల బృందాన్ని ఢిల్లీకి పంపడం ద్వారా వ్యక్తిగత ఒత్తిడి తేవాలని రేవంత్ భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ప్రాథమిక ఆధారాలను సీబీఐకి అందజేయడం ద్వారా దర్యాప్తు అనివార్యం చేయాలన్నది వారి ప్లాన్. విచారణ జరిగినా, జరగకపోయినా.. ఈ అంశాన్ని కేంద్రంపైకి నెట్టడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందవచ్చని, ప్రజాధనం విషయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవచ్చని రేవంత్ సర్కార్ బలంగా నమ్ముతోంది. ఈ వ్యూహం ఫలిస్తే, తెలంగాణ రాజకీయాల్లో మునుపెన్నడూ లేని విధంగా పెను మార్పులు సంభవించే అవకాశం ఉంది.

**ఇప్పుడు విద్యుత్ ఒప్పందాలపైనా..?**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇదివరకు కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేసింది. ఇప్పుడు విద్యుత్ ఒప్పందాలపై కూడా సీబీఐకి అప్పగించాలని నిర్ణయించింది. ఇది బీఆర్ఎస్‌కి ఇబ్బందికర పరిణామం. వాస్తవానికి, తెలంగాణ రాజకీయాల్లో ఇదో సంచలనం. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుల నిర్మాణాల్లో భారీ అవకతవకలు జరిగాయన్న ఆరోపణల మధ్య ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ రాష్ట్ర మంత్రిమండలి తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్రాజెక్టులతో పాటు ఇతర విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి జరిగిందని ప్రభుత్వం నియమించిన జస్టిస్ మదన్ బి. లోకూర్ కమిషన్ ఇటీవల 114 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందని ఈనాడు రిపోర్ట్ చేసింది. ఈ నివేదికలోని అంశాలతో పాటు రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సూచనలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. ఈ వ్యవహారంలో అంతర్రాష్ట్ర అంశాలు ఇమిడి ఉండటం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో ముడిపడి ఉన్నందున దీనిపై నిష్పాక్షికమైన, సమగ్ర విచారణ జరగాలంటే సీబీఐ దర్యాప్తు తప్పనిసరి అని మంత్రిమండలి తీర్మానించింది. దీంతో గత పాలకులకు సంబంధించిన వ్యవహారాలపై విచారణ మరింత వేగవంతం కానుంది.

# నామినేటెడ్ జాతర

(మొదటి పేజీ తరువాయి)

కె.రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన పోస్టులను కూడా త్వరలోనే భర్తీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటి నుంచి నామినేటెడ్ పదవుల కోసం విశ్వప్రయత్నాలు చేసిన ఆ పార్టీ నేతల్లో కొందరికి ఆ పోస్టులు వరించగా ఇంకొందరికి మాత్రం నిరాశే మిగిలింది.

**కార్పొరేషన్ల వారీగా నియమితులైన ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు**

| | |
|---|---|
| బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ | బస్వరాజు శ్రీనివాస్, |
| వైస్ ఛైర్మన్ | పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ |
| కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ | బండి రమేశ్, |
| వైస్ ఛైర్మన్ | పరుచూరి మురళి |
| వాల్మీకి బోయ కార్పొరేషన్ ఛైర్మన్ | గట్టు తిమ్మప్ప, |
| వైస్ ఛైర్మన్ | బోయ నగేష్ |
| యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ | రఘునాథ్ యాదవ్, |
| వైస్ ఛైర్మన్ | గజ్జి భాస్కర్ యాదవ్ |
| వడ్డెర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ | గుంజా రేణుక, |
| వైస్ ఛైర్మన్ | బత్తుల వెంకటేష్ |
| హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఛైర్మన్ | దూడెం వెంకట రమణ , |
| వైస్ ఛైర్ పర్సన్ | జక్కని అనిత |
| లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్ | చరణ్ కౌశిక్ |
| తెలుగు అకాడమీ ఛైర్మన్ | ప్రొఫెసర్ వెంకట రమణ |
| వాషర్‌మెన్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ | డాక్టర్ అజయ్ కుమార్, |
| వైస్ ఛైర్మన్ | బంగారు బాబు |
| గీత కార్మిక కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ | చంద్రశేఖర్ గౌడ్, |
| వైస్ ఛైర్మన్ | కేసం నాగరాజు గౌడ్ |
| పెరిక కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ | గొంగరి వెంకటేశర్లు, |
| వైస్ ఛైర్మన్ బుధ్ధం శ్రీనివాస్ | |
| మేర కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ | సంగ వెంకట్ రాజం, |
| వైస్ ఛైర్మన్ | ఎం లక్ష్మీనారాయణ |
| మున్నూరు కాపు కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ | బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి |
| వైస్ ఛైర్మన్ | అల్లం భాస్కర్ |
| పద్మశాలి కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ | గూడూరి శ్రీనివాస్ |
| వెలమ కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ | జువ్వాడి నర్సింగ్ రావు |

# అర్ధరాత్రి ఆపరేషన్





**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్‌లో రాత్రిపూట ఒంటరి మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడుతున్న ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు మల్కాజ్‌గిరి కొత్త సీపీ సుమతి రంగంలోకి దిగారు. హైదరాబాద్ నగరంలో రాత్రి 11 గంటలు దాటితే చాలు ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బస్టాండ్ ల వద్ద, మెట్రో స్టేషన్ల వద్ద ఒంటరిగా అమ్మాయి కనిపిస్తే చాలు, గద్దల్లా వాలిపోతారు. బైక్స్ పై అమ్మాయి సమీపంలో రౌండ్లు కొడుతూ, కొద్దిసేపు గమనించి, వెంటనే దగ్గరకు వచ్చేస్తారు. వస్తావా మాతో, నీ రేటెంత అంటూ ప్రశ్నల వర్షం కురిపించి వేధింపులకు పాల్పడుతుంటారు. నెమ్మదిగా బేరాలు మొదలెడతారు. ఇలా నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల వద్ద ఇదే తంతు. తాజాగా ఇలాంటి ఆకతాయిలపై దృష్టిపెట్టి, వార్తల్లో నిలిచారు లేడీ సింగం, మల్కాజ్ గిరి నూతన కమిషనర్ సుమతి.

**దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ వద్ద..**

మల్కాజిగిరి సీపీగా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజే, టార్గెట్ ఆకతాయిలు అంటూ రంగంలోకి దిగారు. అర్ధరాత్రి 12 గంటలకు దిల్‌సుఖ్ నగర్ బస్టాండ్ వద్దకు సివిల్ డ్రస్ చేరుకున్న పోలీస్ కమిషనర్ సమతి. రోడ్డుప్రక్కన సాధారణ మహిళలా నిల్చున్నారు. అటుగా వెళ్తున్న ఆగతాయిలు, ఆమెను గమనించడం మొదలుపెట్టారు. అలా కొద్దిసేపటికే ఒక్కొక్కరుగా ఆమె చుట్టూ చేరుకున్నారు. హాలో వస్తావా.. నీ రేటెంత .. అంటూ అడగటం మొదలుపెట్టారు. అలా అర్ధరాత్రి 12 గంటల నుండి తెల్లవారుజామున 3.30 గంటల వరకూ సుమారు మూడున్నర గంటలపాటు లేడీ ఐపీఎస్‌ను కొందరు పోకిరీలు తమ మాటలతో వేధించారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఆమెను బైక్ లతో అడ్డ పడుతూ, ఈ రాత్రికి వస్తావా.. అంటూ బేరాలు మొదలెట్టారు. అలా ఆకతాయిల వేధింపులు భరిస్తూ , అక్కడున్న పరిస్థితులను స్వయంగా గమనిస్తూ రోడ్డుపక్కన గంటలపాటు నిల్చుని రాత్రివేళల్లో మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో స్వయంగా పరిశీలించారు మూడున్నర గంటలుగా అటువైపు ఏ ఒక్క పోలీసు కానిస్టేబుల్ రాలేదు. కనీసం పెట్రోలింగ్ వాహనం సైతం అటువైపు రాకపోవడంతో ఆకతాయిలు ఇంకా రెచ్చిపోయారు. బైక్ లపై చక్కర్లు కొడుతూ, ఒంటరి మహిళను వేధించడం ఆపలేదు. తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో ఓ కానిస్టేబుల్ అటుగా వచ్చి, కమిషనర్ వద్ద నిలుచున్నారు. మరికొద్దిసేపటికే ఓ ఎస్సై వచ్చి మఫ్టీలో ఉన్న ఐపీఎస్ అధికారి సుమతికి సెల్యూట్ కొట్టారు. పోలీస్ ఆ మహిళకు సెల్యూట్ కొట్టడంతో అక్కడున్న ఆకతాయిలకు ఒక్కసారిగా గుండె ఆగినంత పనైంది. అసలు ఏం జరుగుతుందో వారికి అర్థం కాలేదు. ఆమె ఒంటరి మహిళకాదు. వాళ్లు అనుకున్నట్లు సాధారణ మహిళ అంతకన్నాకాదు. ఆమె సివిల్ డ్రస్‌లో ఉన్న ఐపీఎస్ అధికారిణి మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ అని తెలుసుకున్న పోకిరీలకు గుండె ఆగినంత పనైంది. ఇంకేముంది క్షణాల్లో పెట్రోలింగ్ వెహికల్ స్పాట్‌కు రావడం, ఆమెను వేధించిన 40మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించడం చకచకా జరిగిపోయాయి. మరో పోలీసు వాహనంలో స్టేషన్‌కు చేరుకున్న ఐపీఎస్ సుమతి, పోకిరీలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇంకోసారి రోడ్లపై ఒంటరి అమ్మాయిలను టార్గెట్ చేస్తే తాట తీస్తానంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇలా పోలీసులకు చిక్కిన 40 మందిలో విద్యార్థులు, ఉద్యోగులతో పాటు గంజాయి సేవించిన బ్యాచ్ కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇలా సాహోసోపేతమైన ఆపరేషన్లు చేయడం సుమతికి ఇప్పుడేం కొత్తకాదు. సరిగ్గా 25ఏళ్ల కిందట 2001లో డీఎస్పీగా ఛార్జ్ తీసుకున్న వెంటనే కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద ఒంటరిగా మఫ్టీలో వెళ్లినిల్చుని, వేధించడానికి వచ్చిన ఆకతాయిల భరతం పట్టారు.

**వివాదంగా మారుతున్న ఐపీఎస్ ఆపరేషన్..**

ఇలా తెలుగు రాష్ట్రాల్లో లేడీ సింగం, ఐపీఎస్ అధికారిణి సుమతి ధైర్య సహసాలకు సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆఫీసర్ అంటే ఇలా ఉండాలి.. హ్యాట్సాఫ్ మేడం అంటూ పొగడ్తలతో కామెంట్స్, పోస్టులు పెడుతూ మల్కాజ్ గిరి కమిషనర్ చర్యలను మెచ్చుకున్నారు. అయితే ఇదే క్రమంలో ఆమెపై విమర్శలు, కౌంటర్లు కూడా అంతే స్థాయిలో వస్తున్నాయి. ఇవి కాదు మేడం, రాజకీయాల్లో అవినీతి చేసే నేతలను, తప్పులు చేసి తప్పించుకునే బడాబాబులకు శిక్షలు వేయండి అంటూ కొందరు నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.

# మోసగాడు, దొంగలు



(మొదటి పేజీ తరువాయి)

పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు మీ పదేళ్ల పాలనలో రైతులు ఎన్ని కష్టాలు పడ్డారో ఆత్మవిమర్శ చేసుకోవాలి అని హితవు పలికారు. కేటీఆర్ భాషను చూస్తుంటే ఆయనకు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని అర్థమవుతోందని, బూతులు తిడితే నాయకుడు కాలేరని మహేష్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు.

**రాజకీయాల్లో జోకర్ కావద్దు - మంత్రి సీతక్క హెచ్చరిక**

మంత్రి సీతక్క సైతం కేటీఆర్ వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్ ఇచ్చారు.కేటీఆర్ చదువుకున్న వారు, కొంత మంచి పేరున్న వారు.. ఇలాంటి వెకిలి వ్యాఖ్యలు చేసి జోకర్ కావద్దు అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను అమలు చేస్తుంటే, ఓర్వలేక విషం చిమ్ముతున్నారని విమర్శించారు. కేటీఆర్‌కు అధికారం పోయిందని పిచ్చి పట్టింది, అందుకే బూతులు మాట్లాడుతున్నారు. రాహుల్ గాంధీ వంటి నాయకుడిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు అని సీతక్క స్పష్టం చేశారు.

**దిగాజారిపోతున్న భాష**

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టడం రాజ్యాంగబద్ధమైన హక్కు. కానీ, ఆ నిరసనను వ్యక్తులపై బూతులతో చేయడం వల్ల అసలు సమస్య పక్కదారి పడుతోంది. వరంగల్ సభలో రైతుల రుణమాఫీ, బోనస్ వంటి అంశాలపై క్షేత్రస్థాయి ఆధారాలతో కేటీఆర్ మాట్లాడి ఉంటే ప్రభుత్వానికి ఇబ్బంది కలిగేదని.. కానీ, ఆయన వాడిన భాష వల్ల ఇప్పుడు చర్చంతా కేటీఆర్ సంస్కారం చుట్టూనే తిరుగుతోందని అంటున్నారు. ఫ్రస్ట్రేషన్‌తో తిడితే ప్రజల్లో సానుభూతి రాదని, అది కేవలం రాజకీయ రచ్చకు మాత్రమే దారి తీస్తుందని అంటున్నారు.

# కరీంనగర్ పీఎంజే కేసు : ఆరుగురి స్కెచ్..

**ముద్ర డెస్క్:**

కరీంనగర్ లోని పీఎంజే జ్యువెలరీ షాప్ లో జరిగిన దొంగతనంలో పోలీసులు అనేక బృందాలుగా విడిపోయి ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు. ఇప్పటికే దొంగల ముఖచిత్రాలను మీడియాకు విడుదల చేశారు. వారి ఆచూకీ చెప్పిన వారికి లక్ష రూపాయల బహుమతి ఇస్తామని ప్రకటించారు.. ఇది ఇలా ఉండగానే ఈ వ్యవహారంలో రోజురోజుకు కొత్త కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. కరీంనగర్ పీఎంజే జ్యూవెలరీ షాప్ దోపిడీ కేసులో ఇప్పటివరకు పోలీ సులు ఐదుగురు వ్యక్తులు నిందితులు ఉన్నారని గుర్తించారు. ఈ వ్యవహారంలో ఉన్నది ఐదుగురు మాత్రమే కాదని.. ఏకంగా ఆరుగురు ఉన్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. కరీంనగర్లో ప్రవేశించడానికి వీరు ధర్మపురి ప్రాంతంలో బస చేశారు. విజయలక్ష్మి ప్రైవేట్ లాడ్జిలో మూడు రోజులపాటు ఉన్నారు. ముందు నలుగురు వ్యక్తులు వచ్చారు. ఆ తర్వాత ఇద్దరు వేర్వేరుగా అందులోకి ప్రవేశించారు. మొదటి వచ్చిన వ్యక్తులు పల్సర్ బైక్ ద్వారా లాడ్జి లోకి చేరుకున్నారు. వారు ఇచ్చిన ఆధారాలను పరిశీలిస్తే అవన్నీ కూడా ఫేక్ అని తెలుస్తోంది. ఈ దొంగతనం జరిగిన తర్వాత పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తు న్న నేపథ్యంలో వారు విజయలక్ష్మి లాడ్జిలో ఉన్నట్టు తెలిసింది. సీసీ కెమెరాలను పోలీసులు విస్తృతంగా పరిశీలిస్తున్నారు. మూడు రోజులపాటు ఆ దొంగలు ఆ లాడ్జిలో ఉన్నారని పోలీసులకు తెలిసింది. అక్కడ అనేక ఆధారాలు సేకరించిన పోలీసులు.. కేసు దర్యాప్తులో వేగాన్ని పెంచినట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ మధ్య రాయపర్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఇదే తరహాలో దొంగతనం జరిగింది. కాకపోతే దుండగులు ఎటువంటి ఆధారాలు వదలకుండా దొంగతనం చేశారు. రాత్రి సమయం కావడంతో సిసి కెమెరాలలో తమ దృశ్యాలు రికార్డు కాకుండా జాగ్రత్తపడ్డారు.

బ్యాంకు పరిసర ప్రాంతాలలో పోలీసులకు ఒక సిగరెట్ అట్టముక్క దొరికింది. ఆ అట్టముక్క మీద ఉత్తర ప్రదేశ్ అడ్రస్ ఉంది. దీంతో తెలంగాణ పోలీసులు ఉత్తరప్రదేశ్ పోలీసులను సంప్రదించారు. అక్కడ ఉన్న దొంగల ముఠాల వివరాలను తెలంగాణ పోలీసులకు వారు అందించారు. వారి దగ్గర నుంచి బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్లో జరిగిన దొంగతనం కూడా ఇదే తరహాలో ఉండి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ధర్మపురి ప్రాంతంలో విజయలక్ష్మి లాడ్జి పరిసర ప్రాంతాల్లో అనేక కీలక వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా పూర్తిస్థాయిలో క్లారిటీ రావాల్సి ఉంది. ఏది ఏమైనప్పటికీ కరీంనగర్ జిల్లాలో జరిగిన దొంగతనం.. తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే కొద్ది రోజుల్లోనే దొంగలను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

# మిత్రుడే శత్రువైన వేళ..

**టీవీకేకు కాంగ్రెస్ మద్దతుపై డీఎంకే ఆగ్రహం**



**ముద్ర డెస్క్ :**

తమిళనాడు రాజకీయ యవనికపై అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోవడమే కాకుండా జాతీయ స్థాయిలో కీలకంగా ఉన్న ఇండియా కూటమిలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ముఖ్యంగా దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి మద్దతు ఇచ్చే విషయంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం.. దశాబ్ద కాలంగా కొనసాగుతున్న డీఎంకే–కాంగ్రెస్ బంధంలో చిచ్చు పెట్టింది. తమిళనాడులో బలమైన పునాదులు కలిగిన ద్రావిడ మున్నేట్ర కజగం (డీఎంకే), కాంగ్రెస్ పార్టీలు గత కొన్ని ఎన్నికలుగా విడదీయలేని మిత్రపక్షాలుగా కొనసాగుతున్నాయి. అయితే తాజా పరిణామాలతో ఈ మైత్రి బీటలు వారింది. విజయ్ పార్టీకి కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంపై డీఎంకే శ్రేణులు నివురు గప్పిన నిప్పులా ఉన్నాయి. ఈ అసంతృప్తిని డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ అన్నాదురై సోషల్ మీడియా వేదికగా వెళ్లగక్కారు.'వెన్నుపోటు దారులు' అంటూ ఆయన చేసిన ఒక్క పోస్ట్ ఇప్పుడు తమిళ రాజకీయాల్లో కార్చిచ్చులా మారింది. నేరుగా కాంగ్రెస్ పేరు ఎత్తకపోయినప్పటికీ ఆ వ్యాఖ్యల అంతరార్థం హస్తం పార్టీని ఉద్దేశించినదేనని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల వరకు కలిసి నడిచిన కాంగ్రెస్, ఇప్పుడు తమ ప్రధాన రాజకీయ శత్రువుగా మారుతున్న విజయ్‌తో చేతులు కలపడం డీఎంకేకు మింగుడుపడటం లేదు.

**విజయ్ 'పవర్' పాలిటిక్స్.. కాంగ్రెస్ వ్యూహం ఏమిటి?**

సినీ రంగం నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన విజయ్ తొలి ఎన్నికల్లోనే అంచనాలకు మించిన ఓట్ల శాతాన్ని సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ రాకపోయినప్పటికీ కింగ్ మేకర్‌గా ఎదిగారు. ఈ తరుణంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, విజయ్ పార్టీకి మద్దతు ఇచ్చే విషయంపై సానుకూల ప్రకటన చేయడం సంచలనంగా మారింది. కాంగ్రెస్ ఈ నిర్ణయం వెనుక లోతైన రాజకీయ వ్యూహం ఉన్నట్లు కనిపిస్తోంది. డీఎంకే నీడలో కాకుండా, స్వతంత్రంగా ఎదిగేందుకు విజయ్ పార్టీ ఒక బలమైన వేదికగా కాంగ్రెస్‌కు కనిపిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి విజయ్ ఒక ప్రధాన శక్తిగా మారతారని గ్రహించిన కాంగ్రెస్, ఇప్పుడే ఆయనతో స్నేహం పెంచుకోవాలని భావిస్తోంది.

**కూటమి భవిష్యత్తుపై నీలినీడలు**

కాంగ్రెస్ వైఖరి కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో ఉన్న ఇండియా కూటమి ఉనికిని కూడా ప్రశ్నార్థకం చేస్తోంది. మిత్రపక్షాల మధ్య సమన్వయం లోపించిందని, ప్రాంతీయ పార్టీల ప్రయోజనాలను కాంగ్రెస్ గాలికొదిలేస్తోందని డీఎంకే నేతలు అంతర్గత చర్చల్లో అభిప్రాయపడుతున్నారు. 'కూటమి ధర్మాన్ని విస్మరించి ప్రత్యర్థితో చేతులు కలపడం రాజకీయ నైతికత అనిపించుకోదు' అని డీఎంకే సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# విజయ్‌కి గవర్నర్ షాక్

**ముద్ర డెస్క్ :**

తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే (TVK) అధినేత విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ బ్రేక్ వేశారు. కాంగ్రెస్ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చినప్పటికీ, విజయ్ సంఖ్యాబలం 112 వద్దే ఆగిపోయింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118 నిరూపించలేకపోవడంతో, స్పష్టమైన మెజార్టీ చూపిస్తేనే ప్రమాణ స్వీకారానికి అనుమతిస్తామని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ స్పష్టం చేశారు. మరోవైపు ఐయూఎంఎల్, వామపక్షాలు టీవీకేకు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పడంతో విజయ్ ముందు క్లిష్టమైన సవాల్ నెలకొంది. మెజార్టీకి కావాల్సిన ఆరుగురు ఎమ్మెల్యేల కోసం విజయ్ ప్రయత్నాలు ముమ్మరం చేయగా, తమిళనాడు రాజకీయాల్లో ఉత్కంఠ పరాకాష్టకు చేరింది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 07.05.2026
www.mudranews.in | @mudranews



**గుండె ఆరోగ్యం :**

సమతుల్య ఆహారం తీసుకోండి. పండ్లు, కూరగాయలు, గింజలు, చేపలు వంటి పోషకాహారం మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. కొవ్వు, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తగ్గించండి.



# కేంద్ర ప్రభుత్వ తీరుతో ఆలస్యం

- నిబంధనలు సడలించి కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- తడిసిన ధాన్యం, మొక్కజొన్నను పరిశీలించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ముద్ర, ధర్మపురి:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నిబంధనల వల్లనే ధాన్యం కొనుగోలులో ఆలస్యం జరిగిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి ఆకాల వర్షాలకు ధర్మపురి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆన్లైన్ విధానాన్ని తీసుకువచ్చింది అని అన్ లైన్ లో ట్రక్ షీట్ తో పాటు ధాన్యం తరలిస్తున్న వాహనాలకు జిపిఆర్ఎస్ వంటి సాంకేతిక సమస్యలతో కొనుగోలు 15 రోజులు ఆలస్యంగా ప్రారంభమైనట్లు వివరించారు. కేంద్రం తీసుకొచ్చిన నిబంధనలతో రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో నిబంధనలను సడలించిన సీఎం రేవంత్ రె పాత పద్ధతిలో ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు జారీ చేశారని వివరించారు. వారం పది రోజుల్లో మార్కెట్ యార్డుల్లో ఉన్న ధాన్యంతో పాటు మొక్కజొన్న కొనుగోలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఎవరు ఆందోళన పడవద్దు ధర్నాలు రాస్తారోకోలకు దిగవద్దని రైతులు పండించిన పంటను చివరి గింజ కొనుగోలు చేసే బాధ్యతను తాను తీసుకుంటానని తెలిపారు. అధికారులు సమన్వయంతో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు కొనుగోలు విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్న సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. రైతులకు ఉన్న సమస్యలు తన దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, చిలుముల లక్ష్మణ్, వేముల రాజు, సౌళ్ల నరేష్, చీపురుశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

# ఏపీలో భారీ పెట్టుబడులు

**17వ ఎస్ఐపీబీ ఆమోదం**
**రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు**
**39 వేల మందికి ఉద్యోగాలు**



**ముద్ర, అమరావతి:** రాష్ట్రంలో భారీ స్థాయి పెట్టుబడులకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బో సమావేశంలో మొత్తం రూ.2,01,023 కోట్ల విలువైన 25 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 39,067 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇందులో భాగంగా విశాఖపట్నంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.1,08,010 కోట్లతో భారీ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో అదే సంస్థ రూ.51,300 కోట్లతో సోలార్ పవర్ ప్రాజె, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. కడప జిల్లాలో ఆదానీ గ్రూప్ రూ.12,297 కోట్లతో హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును చేపట్టనుంది. తిరుపతి జిల్లాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ రూ.2,508 కోట్లతో మోటార్ సైకిల్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుండగా, అపోలో టైర్స్, ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్, ఐటీసీ, చెట్టినాడ్ సిమెంట్స్ వంటి సంస్థలు కూడా వివిధ పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. అనుమతుల్లో వేగం – 'ఏపీ బ్రాండ్' లక్ష్యం సమావేశంలో సీఎం మాట్లాడుతూ పెట్టుబడుల ప్రతిపాదనలు ఒప్పందాలుగా, ఒప్పందాలు వాస్తవ పెట్టుబడులుగా మారాలని స్పష్టం చేశారు. అనుమతుల ప్రక్రియలో ఒక్క రోజు కూడా ఆలస్యం జరగకూడదని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ఉత్పత్తి ప్రారంభం వరకు నిర్దిష్ట కాలపట్టికలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. "వన్ ఫ్యామిలీ – వన్ ఎంట్రప్రెన్యూర్" లక్ష్య సాధనలో ఎంఎస్ఎంఈలు కీలకమని చెప్పారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయిల్ పామ్, మామిడి, కొబ్బరి, కోకో వంటి పంటలకు విలువ జోడిస్తే అధిక ఆదాయం లభిస్తుందని చెప్పారు. సీఎస్ సాయిప్రసాద్, మంత్రులు టీజీ భరత్, అచ్చెన్నాయుడు, సుభాష్ పయ్యావుల కేశవ్ కూడా హాజరయ్యారు.

# వెయ్యి కార్లు.. 250 బస్సులు

- మోదీ సభకు భారీ జన సమీకరణకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఏర్పాట్లు



**ముద్ర, కరీంనగర్ :** ఈ నెల 10న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న నరేంద్ర మోదీ బహిరంగ సభను భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో జన సమీకరణ చేపడుతున్న పార్టీ, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలను తరలించే దిశగా ప్రత్యేక దృష్టి సారించింది.ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గత నాలుగు రోజులుగా కరీంనగర్ లోనే మకాం వేసి, ఇతర కార్యక్రమాలను పక్కనపెట్టి జన సమీకరణపై ఫోకస్ పెట్టారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ కార్యాచరణను వేగవంతం చేస్తున్నారు. మండలాలు, గ్రామాలు, మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల వారీగా లక్ష్యాలను నిర్దేశించి, ప్రతి ప్రాంతానికి ప్రత్యేక ఇంచార్జీలను నియమించారు.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మండలాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశమై ఎన్ని బస్సులు, ఎన్ని కార్లు అవసరమవుతాయో వివరాలు సేకరించారు. ఆ వివరాల ఆధారంగా వెయ్యి కార్లు, 250 బస్సులు ఏర్పాటు చేసి వేలాది మందిని సభకు తరలించాలని నిర్ణయించారు. గ్రామాల నుంచి స్వచ్ఛందంగా రావడానికి సిద్ధంగా ఉన్న ప్రజలకు రవాణా, తాగునీరు, భోజన సదుపాయాలు కల్పించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జన సమీకరణలో కరీంనగర్ అగ్రస్థానంలో నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.మరోవైపు, రేపటి నుంచి బండి సంజయ్ సికింద్రాబాద్ లో మకాం వేసి నగరం నుంచి కూడా భారీగా జనాన్ని సమీకరించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఉదయం 11 గంటలకు ముషీరాబాద్ అసెంబ్లీ నాయకులతో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మన్ కూడా హాజరుకానున్నారు. సాయంత్రం 5 గంటలకు పరేడ్ మైదానం సమీపంలోని సురభి గార్డెన్స్ లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు.అలాగే ఎల్లుండి బైక్ ర్యాలీ, పాదయాత్రల ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజలను సభకు ఆహ్వానించేలా కార్యాచరణ రూపొందించారు. మహిళా మోర్చా కార్యకర్తలు తమ తమ డివిజన్లలో బొట్టు పెట్టి మహిళలను సభకు ఆహ్వానించాలని పార్టీ సూచించింది. మొత్తంగా మోదీ సభను విజయవంతం చేయడంలో భాగంగా పార్టీ శ్రేణులు అన్ని స్థాయిల్లో కసరత్తు చేస్తున్నారు.

# అల్ఫోర్స్ విద్యార్థులకు అద్భుత ర్యాంకులు


**ఐఐటీ జేయియి (మెయిన్) బి.ఆర్ట్ అండ్ బి. ప్లానింగ్ 2026 ఫలితాలు వెల్లడి**




**ముద్ర, కరీంనగర్:** ఐఐటీ జేయియి (మెయిన్) బి.ఆర్చ్ & బి. ప్లానింగ్ 2026ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.బి.ఆర్చ్ డిగ్రీ ఎస్. శ్రీహిత 174వ ర్యాంకుతో అత్యుత్తమ స్థానంలో నిలవగా, పటేల్ అక్షయ 189వ ర్యాంకు, డి. తనుశ్రీ 227వ ర్యాంకు, వి. రితిక 287వ ర్యాంకు, ఎస్. ఆధ్య 319వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా టి. వెంకట నిహిత్ (903), సి.హెచ్. భీమ (1107), ఆర్. నేహగాయత్రి (1719), పి. శ్రీనిధి (1776), పి. హర్షిణి (2325), ఉమైరా సన్నున్ (2626), పి. అక్షయప్రియ (2786) ర్యాంకులు సాధించి సంస్థకు కీర్తి తీసుకొచ్చారు.బి.ప్లానింగ్ విభాగం వి. ప్రణతి 858వ ర్యాంకు సాధించగా, పి. క్రిష (1281), ఎం. వివేక్ రెడ్డి (1554), ఎం. షాలిని (1757), రహీన్ ఉమేద్ (2448), జి. మహాలక్ష్మి (3053), పి. ఆదిత్యలక్ష్మి (3122) ర్యాంకులు సాధించారు.రాబోయే ఐఐటీ (అడ్వాన్స్‌డ్) పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో ప్రత్యేక శిక్షణ ఇస్తామని చైర్మన్ తెలిపారు. పటిష్ట ప్రణాళిక, నాణ్యమైన బోధన, నిరంతర పర్యవేక్షణతో పాటు విద్యార్థుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని చెప్పారు.ఇక రాబోయే ఐఐటీ (అడ్వాన్స్‌డ్)లో కూడా అల్ఫోర్స్ విద్యార్థుల ఉత్తీర్ణత ఫలితాలు సాధించి ప్రతిష్టాత్మక ఐఐటీలో సీట్లు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్వర్ణగిరీషునికి అష్టదళపాదపద్మార్చన సేవ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య పాదారవిందములకు 108 బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవ బుధవారం నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను నిర్వహించి అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మ వారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరిన గోపృష్ట దర్శనాన్ని చేయించారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి సహస్ర నామార్చన సేవను గావించారు. లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను చేశారు. స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా అర్చక స్వాములు నిర్వహించారు.

# మన్నె క్రిశాంక్ కు హైకోర్టు బెయిల్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, అధికారులను దూషించడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఇటీవల కూకట్‌పల్లిలో కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజేంద్ర కుమార్ ఇంటికి వెళ్లి గొడవ పడ్డారనే ఆరోపణలపై కూకట్‌పల్లి పోలీసులు ఆయన ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే 2024లో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక పాత కేసులో పోలీసులు ఆయనపై పీటీ వారెంట్ జారీ చేశారు. ఈ కేసులో విచారణ నిమిత్తం పోలీసులు ఆయనను మేడ్చల్ కోర్టుకు హాజరుపరిచారు. కూకట్‌పల్లి కోర్టు రిమాం డ్ విధించిన క్రిశాంక్, ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఈ క్రమంలో తనపై నమోదైన కేసుల్లో బెయిల్ కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సెలవు రోజుల్లో కూడా పీటీ వారెంట్లు జారీ చేస్తూ తనను వేధిస్తోందని ఆయన తరపు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, బుధవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అయితే కోర్టు నిబంధనల మేరకు పూచీకత్తులు సమర్పించాల్సి ఉంటుందని న్యాయమూర్తి ఆదేశించారు. అంగన్‌వాడీలకు ఫోన్ల కొనుగోలులో స్కామ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన మైనింగ్ వ్యవహారాలను ప్రశ్నించినందుకే తనపై అక్రమ కేసులు బనాయించారని క్రిశాంక్ ఆరోపిస్తున్నారు.




# నావల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలగొద్దు

- నా కాన్వాయ్ కోసం రాకపోకలకు ఆటంకం కలిగించొద్దు
- నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోండి
- డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- పోలీస్ కమిషనర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్
- 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తన పర్యటనల సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి డీజీపీ సీవీ ఆనంద్ ను ఆదేశించారు. ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలిపివేయొద్దని డీజీపీకి సూచించా రు. బుధవారం ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు వద్ద ట్రాఫిక్ జామ్‌పై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ కోసం ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని, ఎదురుగా వచ్చే వాహనాలను కూడా ఆపి ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం హెచ్చరించారు. మరోవైపు.. సీఎం ఆదేశాలపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్ రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం త్వరలో 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ పూర్తిగా ఆపకుండా సింగిల్ లైన్‌లో వాహనాలు పంపే ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. రద్దీ సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలు ముందు గానే సిద్ధం చేయాలని సూచించారు. అలాగే విమానాశ్రయం పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలని డీజీపీ పోలీసు అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ముందు.. నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని.. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ నివారణపై దృష్టి సారించాలన్నారు. ఐఎస్‌డబ్ల్యూ, సీఎస్‌డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల విభాగం కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం అవ్వాలని అధికారులకు డీజీపీ ఆదేశించారు.

# ఎర్రజెండా ఎజెండా.. ప్రజల అజెండా

**- పదవుల కోసం కాదు.. ప్రజల కోసం**

**- కమ్యూనిస్టులపై విషప్రచారం ఎందుకు..?**



పదవుల కోసం కాదు.. ప్రజల కోసం కమ్యూనిస్టు రాజకీయాలు సాగుతాయి. ప్రజాస్వామ్యంలో గెలుపులు, ఓటములు శాశ్వత సత్యాలు కావు. అధికారం ఒక దశ.. ప్రతిపక్షం మరో దశ. ఈ రెండింటి మధ్యే చాలా పార్టీల రాజకీయ ప్రయాణం సాగుతుంది. కానీ ప్రజా రాజకీయాలకు అంకితమైన శక్తులను ఎన్నికల ఫలితాలతో మాత్రమే కొలవడం చరిత్రను వక్రీకరించడమే. అధికారంలో ఉన్నప్పుడే ప్రాసంగికత, ఓడితే అంతమనే వాదన నిజమైన విశ్లేషణ కాదు.

ఇతర రాజకీయ పార్టీలు ఎన్నోసార్లు అధికారంలోకి వచ్చి, తిరిగి ఓటములను చవిచూశాయి. అయినా వాటి పరాజయాలను ఎప్పుడూ "చరిత్ర ముగింపు"గా చూపలేదు. కానీ కమ్యూనిస్టుల విషయంలో మాత్రం కార్పొరేట్ మీడియా భిన్నంగా వ్యవహరిస్తోంది. త్రిపుర, బెంగాల్, కేరళలో వెనుకడుగులు పడగానే "వామపక్షాల కాలం ముగిసింది", "ఎర్రజెండా ప్రభావం తగ్గింది" అంటూ ప్రచారం చేసింది.

అయితే కమ్యూనిస్టుల ప్రత్యేకత అధికారంతో సంబంధం లేకుండా ప్రజల పక్షాన నిలబడటంలోనే ఉంది. పీఠం ఉన్నా పోరాటం.. లేకపోయినా పోరాటం. సభలో ఉన్నా ప్రజల గొంతే.. వీధిలో ఉన్నా ప్రజల కోసం ఉద్యమమే. అందుకే వారిని కేవలం సీట్లతో అంచనా వేయలేం.

కమ్యూనిస్టులకు సీట్ల చరిత్ర మాత్రమే కాదు.. శతాబ్దాల పోరాట చరిత్ర ఉంది. స్వాతంత్ర్యోద్యమం నుంచి రైతాంగ పోరాటాలు, కార్మిక సమ్మెల నుంచి భూ హక్కుల ఉద్యమాలు, వెట్టిచాకిరి నిర్మూలన నుంచి కనీస వేతనాలు, ఎనిమిది గంటల పనిదినం, కార్మిక చట్టాలు, విద్య–వైద్య హక్కుల సాధన వరకు ప్రజల తరఫున సాగిన ప్రతి ముఖ్య పోరాటంలో వారి పాత్ర స్పష్టంగా కనిపిస్తుంది. ఇవన్నీ అధికార కరుణతో వచ్చినవి కావు.. ప్రజా పోరాటాల ఫలితాలే.

అందుకే కమ్యూనిస్టులను కార్పొరేట్ మీడియా లక్ష్యంగా చేసుకుంటోంది. వారు కేవలం రాజకీయ ప్రత్యర్థులు కాదు.. దోపిడీ వ్యవస్థను ప్రశ్నించే సిద్ధాంత శక్తి. ఎర్రజెండా బలహీన పడితే ప్రజా చైతన్యం తగ్గుతుందనే భయం ఉంది. అందుకే వారి ఉద్యమాలను పక్కనపెట్టి, ఎన్నికల వెనుకడుగులను మాత్రమే పెద్దదిగా చూపించే ప్రయత్నం జరుగుతోంది.

ఇక్కడ మీడియా పాత్రపై మౌలిక ప్రశ్న తలెత్తుతుంది. పత్రిక ప్రజల పక్షాన నిలవాలా.. లేక పాలకుల పక్షానా? జర్నలిజం అధికారాన్ని ప్రశ్నించాలి, అణగారిన వర్గాల గొంతుకగా నిలవాలి. కానీ నేడు ప్రజా సమస్యల కంటే అధికార ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం దక్కుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు.

కమ్యూనిస్టుల రాజకీయాల్లో అధికారం లక్ష్యం కాదు.. ప్రజా ప్రయోజనాల సాధనానికి ఒక సాధనం మాత్రమే. చరిత్రను ప్రచారంతో చెరిపేయలేరు. కమ్యూనిస్టులు కేవలం పార్టీ కాదు.. ప్రజల పక్షాన నిలిచే శక్తి.

దోపిడీ ఉన్నంతకాలం.. శ్రమజీవి ఉన్నంతకాలం.. అతని కోసం పోరాడే ఎర్రజెండా ఉంటుంది. అది పదవుల కోసం కాదు.. హక్కుల కోసం.

– గడగోజు రవీంద్రాచారి
జర్నలిస్టు రచయిత
9848772232



## రిటైర్మెంట్ బకాయిలపై గవర్నర్‌కు వినతులు





**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఈరోజు (7-5-2026) గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గారికి పెన్షనర్ సంఘాల ప్రతినిధులు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వం 100 రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ స్పష్టమైన కార్యాచరణ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వేలాది మంది పెన్షనర్లు బకాయిల కోసం ఎదురుచూస్తుండగా, తగిన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. హెల్త్ కార్డులు కూడా జారీ కాకపోవడంతో వైద్యం విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. బకాయిలను నెల రోజుల్లో ఏకమొత్తంగా చెల్లించేలా గవర్నర్ జోక్యం చేసుకోవాలని ఇంజమూరి రఘునందన్, బక్కా జడ్సన్ కోరారు. పెన్షనర్లు అందరూ గవర్నర్‌కు వ్యక్తిగత లేఖలు పంపాలని పిలుపునిచ్చారు.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-IIకు ఆమోదం తెలపండి

**ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉండాలి**

**ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-III కింద చేపట్టండి**

**కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్ మెట్రో ఫేజ్–IIకు ఆమోదం తెలపాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్–II సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్–II, మెట్రో ఫేజ్–IIIపై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–II, ఫేజ్–III విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రో ఫేజ్–Iను ఎల్&టిఎంఆర్హెచ్ఎల్ ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్–I ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్–II, ఫేజ్–III విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్–IIలో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–II ప్రాజెక్ట్ ను భారత ప్రభుత్వం – తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ – భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్–IIIగా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్–III కిసంబంధించిన డీపీఆర్ ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో బయో-టెర్రర్ కుట్ర కేసు

**NIA ఛార్జ్ షీట్‌లో సంచలన విషయాలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో** : చారిత్రక నగరం హైదరాబాద్‌లో పెను ప్రకంపనలు సృష్టించిన బయో–టెర్రర్ కుట్రకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. నగరానికి చెందిన డాక్టర్ మొహినుద్దీన్ సహా ముగ్గురు నిందితులపై ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో తాజాగా ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. సామూహిక జన సమూహాలను లక్ష్యంగా చేసుకుని, విష ప్రయోగం ద్వారా వారిని చంపి విపత్తు సృష్టించాలని ఈ ముఠా ప్లాన్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కుట్రలో ప్రధాన నిందితుడైన డాక్టర్ మొహినుద్దీన్, అమ్జద్, మరో వ్యక్తి కలిసి బహిరంగ ప్రదేశాల్లో విషప్రయోగం చేసేందుకు ప్లాన్ చేశారు. అత్యంత ప్రమాదకరమైన రిసిన్ అనే విష పదార్థాన్ని ఉపయోగించి సామూహిక హత్యలకు వీరు పాల్పడాలని నిందితులు భావించారు. తొలుత గుజరాత్‌లో భారీ ఎత్తున జరిగే ఉత్సవాలు, బహిరంగ సభలను లక్ష్యంగా చేసుకుని ఈ విష ప్రయోగానికి మొహినుద్దీన్ గ్యాంగ్ ప్రణాళిక సిద్ధం చేసింది. రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఆహారం లేదా నీటి ద్వారా ఈ విషాన్ని ప్రయోగించి భారీగా ప్రాణనష్టం కలిగించడమే నిందితుల ఉద్దేశమని ఎన్ఐఏ వెల్లడించింది.

ఈ కేసులో పట్టుబడిన డాక్టర్ మొహినుద్దీన్ విదేశాల్లోని ఉగ్రవాద భావజాలం ఉన్న వ్యక్తులతో ఆన్‌లైన్ ద్వారా టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. డార్క్ నెట్, సోషల్ మీడియా వేదికగా విష పదార్థాల తయారీపై వీరు శిక్షణ పొందినట్లు దర్యాప్తులో ప్రాథమికంగా వెల్లడైంది. గత ఏడాది కాలంగా రహస్యంగా సాగుతున్న ఈ కుట్రను పసిగట్టిన ఎన్ఐఏ అధికారులు, నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుండి పలు డిజిటల్ ఆధారాలను, మ్యాపులను స్వాధీనం చేసుకున్నారు. వీరు ఇంకా ఎక్కడెక్కడ బయో టెర్రర్ దాడులకు ప్లాన్ చేశారు, వీరికి ఎవరితో లింక్స్ ఉన్నాయనే కోణంలోనూ ఎన్ఐఏ పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తోంది.

**ఏమిటీ రిసిన్ ?**

ఆముదపు గింజల నుండి తయారయ్యే అత్యంత ప్రమాదకరమైన పదార్థమే ఈ రిసిన్ విషం. దీనిని పొడి రూపంలో, గాలిలో స్ప్రే రూపంలో లేదా ఆహారంలో కలిపి విషంలా ప్రయోగించవచ్చు. ఇది శరీరంలోకి ప్రవేశించిన కొన్ని గంటల్లోనే నాణీకణాలు, రక్త కణాల పనితీరును దెబ్బతీసి ప్రాణాలు తీస్తుంది. ఇప్పటివరకూ దీనికి విరుగుడు కూడా అందుబాటులో లేదని తెలుస్తోంది. అందుకే నిందితులు ఈ మార్గంలో బయో టెర్రర్ దాడులకు సిద్ధమయ్యారు.



# నిర్మాణ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయొద్దు

**ఎస్కీ కనస్ట్రక్షన్ అండ్ డిమాలిశన్ వర్క్ షాప్ లో జయేష్ రంజన్**




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను అక్రమంగా పారవేయడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ తెలిపారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ నగరంలో రోజుకు సుమారు 1700 టన్నుల నిర్మాణ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు.

ఈ వ్యర్థాలను చెరువులు, ఖాళీ ప్రదేశాల్లో వేయడం వల్ల సమస్యలు తీవ్రతరమవుతున్నాయని, ఐకియా ప్రాంతంలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడానికి సుమారు రూ.60 కోట్లు అవసరమని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్ కోసం మరిన్ని ప్లాంట్లు అవసరమని, ప్రభుత్వ టెండర్లలో 20–25% రీసైకిల్ మెటీరియల్ వినియోగం చేపట్టనున్నట్లు చెప్పారు. 2047 నాటికి హైదరాబాద్‌ను నెట్ జీరో నగరంగా మార్చేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమీషనర్ రఘు ప్రసాద్ కన్ స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ ప్రాధాన్యతపై సమగ్ర వివరణతో కూడిన ప్రెసెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో జి.హెచ్.ఎంసి రిటైర్డ్ ఎక్సిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వర్ రావు, సోమ శ్రీనివాస్ రెడ్డి ఇంజనీర్ అండ్ కాంట్రాక్టర్స్ డైరెక్టర్ సోమ శశాంక్ రెడ్డి, డెలాయిట్ సి అండ్ డి అధికారి అరవింద్ ప్రెసెంటేషన్స్ ఇచ్చారు.

ఈ వర్క్ షాప్ లో జి.హెచ్.ఎం.సి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటుగా, హైడ్రా, హెచ్.ఎం.డిఏ లో పనిచేస్తున్న పలువురు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు, ఎస్కీ లోని సెంటర్ ఫర్ క్లయిమేట్ చేంజ్ డివిజన్ హెడ్ డాక్టర్ చంద్రకళ , ఫ్యాకల్టీ అది నరేష్ కార్యక్రమ సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.

## బోడుప్పల్ లో స్వీయ జనగణనపై అవగాహన

బోడుప్పల్, ముద్ర: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ లో బుధవారం జనగణన–2027 స్వీయ నమోదుపై ప్రజానీకానికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎ.శైలజ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని 264 కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులకు స్వీయ జనగణనపై అవగాహన కల్పించారు. డిప్యూటీ కమిషనర్ శైలజ ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిజిటల్ పద్ధతిలో నిర్వహించే జనగణన–2027లో స్వీయ నమోదు విధానం చాలా కీలకమని అన్నారు. ప్రతి కుటుంబం సరైన వివరాలను స్వయంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే, స్వీయ నమోదు ప్రక్రియలో ఎటువంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో జనగణనపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## ప్రైవేట్' విద్యాసంస్థల దోపిడీని అరికట్టడంలో సర్కార్ విఫలం

**టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై ప్రభుత్వం విఫలమైందని కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. ఫీజుల నియంత్రణకు తక్షణమే చట్టం తీసుకురావాలని, ఈ ఏడాది ఫీజులు పెంచకుండా జీవో జారీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ, ప్రైవేట్ స్కూళ్లు 50 నుంచి 120 శాతం వరకు ఫీజులు పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని, కొత్త జీవోను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడం తమ పార్టీ లక్ష్యమని కవిత స్పష్టం చేశారు.

## అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీల్లో సింగరేణి విజయకేతనం

**జాంబియాలో జరిగిన పోటీలలో ప్రతిభ చాటిన సింగరేణి రెస్క్యూ బృందం**




ముద్ర, తెలంగాణ బ్యూరో : జాంబియా దేశంలో నిర్వహించిన అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీల్లో సింగరేణి జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి భూగర్భ రెస్క్యూ విభాగంలో ప్రథమ బహుమతి సాధించింది. ప్రపంచంలోని పలు దేశాల జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో భారతదేశం నుంచి కోల్ ఇండియా, సింగరేణి సహా ఇతర సంస్థలు పాల్గొన్నాయి. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత అంతర్జాతీయ స్థాయిలో సింగరేణి జట్టు మళ్లీ ప్రతిభ చాటడం విశేషం. ఏప్రిల్ 30 నుంచి మే 5 వరకు జరిగిన ఈ పోటీల్లో ఫైర్ ఫైటింగ్, రెస్క్యూ, సాంకేతిక నైపుణ్యాలపై పరీక్షలు నిర్వహించారు. అన్ని విభాగాల్లో మెరుగైన ప్రదర్శనతో సింగరేణి జట్టు ఇతర జట్ల కంటే ముందంజలో నిలిచింది. భూగర్భ రెస్క్యూ పోటీలో భాగంగా నిర్వహించిన టెక్నీషియన్ పరీక్షలో సింగరేణికి చెందిన సాయి కృష్ణ వేగంగా పనిని పూర్తి చేసి ప్రత్యేక గుర్తింపు పొందాడు. అనంతరం 700 మీటర్ల లోతులో ప్రమాదంలో చిక్కుకున్న ఇద్దరిని గుర్తించి, సమర్థవంతంగా రక్షించే పనిని కేవలం 52 నిమిషాల్లో పూర్తి చేసి జట్టుగా విశేష ప్రతిభ చాటారు. ఈ విజయం పట్ల సింగరేణి సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి అభినందనలు తెలిపారు. జట్టు సభ్యుల కృషి, క్రమశిక్షణ, శిక్షణ ఈ విజయానికి కారణమని ప్రశంసించారు. ప్రపంచ స్థాయిలో భారత గనుల భద్రతా నైపుణ్యాన్ని చాటిన ఈ విజయం సింగరేణి సంస్థకు గర్వకారణంగా నిలిచింది. ఈ పోటీల్లో కోల్ ఇండియా, సింగరేణితో పాటు పలు కంపెనీలు పాల్గొన్నాయి. చైనా, కొలంబియా, జాంబియా, కెనడా, ఆస్ట్రేలియా, పోలాండ్ ఇంకా ఇతర దేశాల జట్లు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటాయి. సింగరేణి రెస్క్యూ జనరల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి సారథ్యంలో రామగుండం మైన్స్ రెస్క్యూ స్టేషన్ లో సింగరేణి నుంచి ఎంపిక చేసిన జట్టుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సింగరేణి మైన్స్ రెస్క్యూ జట్టులో జి. ప్రమోద్ కుమార్, బి. నితిన్ కుమార్, ఎన్. భానుప్రసాద్, ఏ. శ్యాం కుమార్, ఆర్. శ్రీకాంత్, సి.హెచ్. సాయి కృష్ణ , ట్రాన్స్ లేటర్ గా జి. రాజేందర్ రెడ్డి ఈ పోటీలలో పాల్గొన్నారు.

## జీవో నెం. 559పై స్టే ఇవ్వండి

**రాష్ట్ర భద్రతా సలహాదారుగా బి. శివధర్ రెడ్డి నియామకంపై హైకోర్టులో పిటీషన్**

ముద్ర, తెలంగాణ బ్యూరో : రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ బి. శివధర్ రెడ్డి నియామకం వివాదస్పదంగా మారింది. ఆయన నియామకం చెల్లదంటూ హైదరాబాద్ కు చెందిన టి. ధన్‌పాల్ రావు బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన నియామకంపై ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 559పై స్టే విధించాలని కోర్టుకు ఆయన విజ్ఞప్తి చేశారు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజీపీ నియామకం జరిగిందని తన పిటిషన్‌లో ధన్‌పాల్ రావు స్పష్టం చేశారు. యూపీఎస్సీ నుంచి అర్హుల జాబితా తీసుకోలేదని పిటిషన్‌లో ఆయన ఆరోపించారు. ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే.. డీజీపీగా నియామకం జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**రాష్ట్ర భద్రతా సలహాదారుగా బాధ్యతలు**

మాజీ డీజీపీ శివధర్ రెడ్డి రాష్ట్ర భద్రతా సలహాదారుగా బాధ్యతలు స్వీకరించారు. బుధవారం బంజారాహిల్స్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన విధుల్లో చేరారు. హైదరాబాద్ సీపీ వి.సి సజ్జనార్ సహా పలువురు సీనియర్ పోలీస్ అధికారులు ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివధర్ రెడ్డి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఏపీకి మరో దిగ్గజ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ క్యారియర్

**శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్**

**రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి, 3వేల ఉద్యోగాల కల్పన**



ముద్ర, శ్రీసిటీ: ఏపీకి అంతర్జాతీయ పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పారిశ్రామికవాడలో బుధవారం ఉదయం అమెరికాకు చెందిన దిగ్గజ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ క్యారియర్ ఏసీ తయారీ యూనిట్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు సంస్థ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఛైర్మన్, సీఈవో డేవిడ్ ఎల్ గిట్లిన్ తో కలిసి మంత్రి లోకేష్ క్యారియర్ ఏసీ తయారీ పరిశ్రమకు భూమిపూజ చేశారు. అనంతరం సంస్థ ప్రతినిధులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ క్లైమేట్ సొల్యూషన్స్ ఏసియా పసిఫిక్, మిడిల్ ఈస్ట్ అండ్ ఆఫ్రికా ప్రెసిడెంట్ మేకేల్ ఎల్.గియర్టెస్, క్యారియర్ ఎయిర్ కండిషనింగ్ అండ్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్(క్యారియర్ ఇండియా) మేనేజింగ్ డైరెక్టర్ సుందరేశన్ నారాయణన్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఆపరేషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మైక్ డుయిజర్, చీఫ్ పీపుల్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నడియా విల్లెనెవ్, శ్రీసిటీ కో–ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ ధర్మకర్తల మండలి కీలక నిర్ణయాలు



ముద్ర, అమరావతి : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి సమావేశంలో భక్తుల సేవల మెరుగుదల, ధర్మ పరిరక్షణ, విద్య–వైద్య రంగాల అభివృద్ధిపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సర్వదర్శనం క్యూలైన్లలో అదనపు మరుగుదొడ్ల నిర్మాణం, తిరుమల రోడ్లు–సర్కిళ్లకు ఆధ్యాత్మిక పేర్లు, టీటీడీ విద్యాసంస్థల్లో ఆధునిక మౌలిక వసతుల ఏర్పాటు వంటి చర్యలకు ఆమోదం లభించింది. అలాగే గోగర్భం డ్యామ్ నుంచి అదనపు నీటి పైప్‌లైన్, పట్టు వస్త్రాలు–దుప్పట్ల కొనుగోలు, వర్ధనపల్లి శివాలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం నిర్ణయించారు. చిన్నారుల కోసం ఉచిత "అక్షర గోవిందం" కిట్, వినికిడి లోపం గల 150 మందికి ఉచిత వినికిడి యంత్రాల పంపిణీకి ఆమోదం ఇచ్చారు. కోయంబత్తూరులో భూమి టీటీడీలో విలీనం, నవీ ముంబై ఆలయానికి సిబ్బంది నియామకం, ముంబైలో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణానికి సహకారం వంటి నిర్ణయాలు కూడా తీసుకున్నారు. తిరుమలలో అన్ని కార్యాలయాలకు ఒకే పరిపాలనా భవనం, అలిపిరి వద్ద శాశ్వత యాగశాల, లేపాక్షిలో కల్యాణ మండపం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమం భాగంగా హెల్త్ స్కీమ్ రీయింబర్స్‌మెంట్ పెంపు, కాంట్రాక్ట్–ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి దర్శనం, లడ్డూ కార్డులు మంజూరు చేశారు. ధూప, దీప, నైవేద్య నిధిని ₹5,000 నుంచి ₹10,000కు పెంచారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో శ్రీ ఎం రవిచంద్ర గారు, బోర్డు సభ్యులు, అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి గారు, జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం గారు, సివిఎస్ఓ శ్రీ కే.వి. మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 07-05-2026
www.mudranews.in | @mudranews



### గుండె ఆరోగ్యం
**రక్తపోటు, చక్కెర నియంత్రణలో ఉంచండి**

బీపీ, షుగర్ నియంత్రణలో లేక పోతే గుండెతో పాటు మెదడు పని తీరుపై ప్రభావం పడుతుంది. నియమితంగా పరీక్షలు చేయించు కోవడం అవసరం.





## ప్రధాని పర్యటన భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష

**శేరిలింగంపల్లి, ముద్ర ప్రతినిధి:** ఈ నెల మే 10న ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై సీఎస్ రామకృష్ణారావు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్, ట్రాఫిక్, ఇంటెలిజెన్స్, జీహెచ్ఎంసీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణలు, అవసరమైన ఆంక్షలు అమలు చేస్తూ భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని భద్రతకు సంబంధించిన 'బ్లూ బుక్' మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, పర్యటన వివరాలను గోప్యంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. హెచ్ఐసీసీలో జరగనున్న కార్యక్రమ స్థలాన్ని కూడా అధికారులు పరిశీలించారు.

ఈ సమావేశంలో డీజీపీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** గ్రామీణ విద్యార్థుల రవాణా సౌలభ్యం, విద్యాభివృద్ధి కోసం నాగర్‌కర్నూల్‌లో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఎంపీ డాక్టర్ మల్లు రవి చొరవతో, జిందాల్ స్టీల్ పవర్ సంస్థ సిఎస్ఆర్ నిధుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 7వ తరగతి పూర్తి చేసిన 130 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డితో కలిసి ఎంపీ మల్లు రవి ప్రారంభించారు. మొదటగా కొమ్మెర గ్రామానికి చెందిన 48 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సమస్యను తగ్గించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరాలని సూచించారు. కలెక్టర్ హేమంత్ పాటిల్ విద్యార్థుల హాజరు, ఫలితాలు మెరుగుపడతాయని అన్నారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి కూడా ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, సంస్థ ప్రతినిధి రెడ్డి నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారులు షర్ఫుద్దీన్, వెంకటేశ్వర్లు శెట్టి, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## మల్కాజిగిరిలో లేడీ కమిషనర్ అర్ధరాత్రి సంచలన ఆపరేషన్

**మేడ్చల్ జిల్లా, ముద్ర ప్రతినిధి:** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ మాలతి బాధ్యతలు స్వీకరించిన ఐదవ రోజే సంచలన ఆపరేషన్ నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి సాధారణ మహిళగా వేషం వేసుకొని దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టాండ్‌కు వెళ్లి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది ఆకతాయిలు ఆమెను గుర్తించకుండా చుట్టుముట్టి అసభ్యంగా ప్రవర్తించారు. వారి చేష్టలను ఆమె ఓపికగా గమనిస్తూ రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు నిఘా పెట్టారు. అనంతరం పోలీసులు వచ్చాక ఆకతాయిలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉండగా, కొందరు మద్యం మరియు గంజాయి మత్తులో ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 40 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ ఆపరేషన్ ద్వారా రాత్రి వేళల్లో మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రాంతంలో హాస్టళ్లు ఎక్కువగా ఉండటం వల్ల యువకుల అల్లరి పెరుగుతోందని పోలీసులు గుర్తించారు.

## గ్యాస్ ధరల పెంపుపై సీపీఐ నిరసన




**కాప్రా, ముద్ర ప్రతినిధి:** గ్యాస్ సిలిండర్ ధరల పెంపుతో కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతోందని సీపీఐ రాష్ట్ర నాయకుడు వి.ఎస్. బోస్ విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.ఎస్. బోస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచబోమని హామీ ఇచ్చి, అనంతరం ధరలను భారీగా పెంచారని ఆరోపించారు. కమర్షియల్ సిలిండర్ ధరలను గణనీయంగా పెంచడంతో చిన్న వ్యాపారులు, టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు నడిపే నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సిలిండర్ ధరల పెరుగుదల కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార ధరలు కూడా పెరిగి ప్రజలపై పరోక్ష భారం పడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శంకర్రావు, టి. సత్యప్రసాద్, కే. ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం



**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించే దిశగా శ్రీపురం చౌరస్తా వద్ద నూతన ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ పాటిల్, డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్, ట్రాఫిక్ ఎస్ఐ కళ్యాణ్, టౌన్ ఎస్ఐ గోవర్ధన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న వాహన రాకపోకల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు ఆధునిక సిగ్నల్ వ్యవస్థ అవసరమని తెలిపారు. ప్రజల భద్రత, సౌకర్యం దృష్ట్యా పట్టణంలోని మరిన్ని కూడళ్ల వద్ద కూడా ఇలాంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మాధవ్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, అధికారులు, పోలీసులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## దేవాలయానికి ఏసీ బహుకరణ



**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** స్థానిక శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి కమిటీ సభ్యుడు దశరథం 1.5 టన్నుల ఎల్‌జీ ఏసీని బహుకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు తీగల సునీంద్ర, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి బాలరాజు, లక్ష్మీనరసింహ గౌడ్, రమేష్ చారి తదితరులు, భజన మండలి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దాతృత్వంతో ముందుకు వచ్చిన దశరథంను కమిటీ సభ్యులు అభినందించారు. ఆయన కుటుంబానికి స్వామి వారి ఆశీస్సులు ఉండాలని భక్తులు ప్రార్థించారు.

## పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటేష్ బాధ్యతల స్వీకరణ



**జోగులాంబ గద్వాల, ముద్ర ప్రతినిధి:** గట్టు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ గా క్యామ వెంకటేష్ బుధవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు తీర్పు మేరకు బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సేవ చేసే మరో అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. యూరియా, ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులకు రుణాలపై అవగాహన కార్యక్రమం

**జోగులాంబ గద్వాల, ముద్ర ప్రతినిధి:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేటి దొడ్డి రైతు వేదికలో రైతులకు స్వల్పకాలిక, మధ్యకాలిక రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ భూములపై బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. రైతులు స్వల్పకాలిక (షార్ట్ టర్మ్), మధ్యకాలిక రుణాలను తమ అవసరాలకు అనుగుణంగా పొందవచ్చని చెప్పారు. ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కూడా పాల్గొని పంట రుణాలు, పశుసంవర్ధక రుణాలు, వ్యవసాయ ఉపకరణాల కొనుగోలుకు సంబంధించిన రుణాలపై వివరించారు. రుణాలకు అవసరమైన పత్రాలు, వడ్డీ రేట్లు, చెల్లింపు విధానం, ప్రభుత్వ పథకాలపై రైతులకు స్పష్టత ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్ అక్రమణలపై మున్సిపల్ అధికారుల చర్యలు

**గద్వాల, ముద్ర ప్రతినిధి:** గద్వాల పట్టణంలో ఫుట్‌పాత్‌లు, రహదారులపై అక్రమ ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు. భీంనగర్ పరిధిలో కృష్ణవేణి చౌరస్తా నుంచి నదీ అగ్రహారం రోడ్డులో జూరాల కాలువ వరకు ఇరువైపుల ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను గుర్తించారు.

దుకాణాల యజమానులకు రెండు రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలను పాటించకపోతే జేసీబీలతో తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటికే రోడ్ల కొలతలు తీసుకుని మార్కింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణల వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్ని చోట్ల నాలాలపై కూడా నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు రోడ్లపైకి చేరుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## డీజీపీ ఆనంద్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే వినతి




**కాప్రా, ముద్ర ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీ సీవీ ఆనంద్‌ను హైదరాబాదులోని డీజీపీ కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సమస్యలపై వినతి పత్రం అందజేశారు. చర్లపల్లి డివిజన్‌లో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న స్టోన్ వాటర్ డ్రైనేజ్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. ఈ పనులు పూర్తయితే వరద నీటి నిల్వ సమస్యలు తగ్గి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా నిర్దిష్ట కాలపట్టికలో పూర్తి చేయాలని, సంబంధిత శాఖల మధ్య సమన్వయం కల్పించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## బిజినేపల్లి తాండలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట



**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం బిజినేపల్లి తాండలో శ్రీ వినాయక, శివాలయం, నంది, హనుమాన్ దేవాలయాల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సమాజ అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మిద్దె రాములు, ఉప సర్పంచ్ మహేష్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీఎస్పీని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు




**ముద్ర, పెబ్బేరు:** వనపర్తి జిల్లా కేంద్రానికి ఇటీవలే డీఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన గిరిబాబును బుధవారం పోలీస్ కార్యాలయంలో పెబ్బేరు మండల కేంద్రానికి చెందిన బున్యాధిపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించాలని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయనను కోరారు. డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ లో భాగమై ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కాంటిస్టెంట్ సర్పంచ్ వనం మల్లేష్ యాదవ్, సురేష్, మేకల విజయ్, నరసింహ, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**తాండూర్, ముద్ర ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గ పరిధిలో యాలాల్ మండలం అక్కంపల్లి గ్రామంలో ఐకేపీ, అగ్గనూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ద్వారా దొడ్డు రకం క్వింటాల్‌కు రూ.2,389, సన్న రకం బియ్యానికి రూ.500 బోనస్ తో మద్దతు ధర అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సంతోషంగా పంటలు సాగు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.



## పనుల్లో జాప్యం నివారించాలి

**- జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్**


**శేరిలింగంపల్లి, ముద్ర ప్రతినిధి:** శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జోనల్ పరిధిలోని అన్ని విభాగాల అధిపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విభాగాల మధ్య సమన్వయం లోపించకుండా చూసుకోవాలని, తద్వారా పనుల్లో జాప్యాన్ని నివారించాలని ఆదేశించారు. కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు వంటి అత్యవసర పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 07.05.2026
www.mudranews.in | @mudranews



**గుండె ఆరోగ్యం:**

మానసిక వ్యాయామాలు చేయండి పజిల్స్, చదువు, కొత్త విషయాలు నేర్చుకోవడం మెదడును చురుకుగా ఉంచుతుంది.ఇవి జ్ఞాపకశక్తి తగ్గుదలను ఆలస్యం చేస్తాయి.



# పెళ్లికి ముందే అండగా..

### - మాట నిలబెట్టుకున్న సర్దార్ రవీందర్ సింగ్



**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ నగర రాజకీయాల్లో ప్రజలకు దగ్గరగా ఉండే, మాట ఇచ్చి నిలబెట్టుకునే నాయకుడిగా పేరొందిన 58వ డివిజన్ కార్పొరేటర్, మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ మరోసారి తన ప్రత్యేకతను చాటిచెప్పారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, పెళ్లికి ముందుగానే ఆడబిడ్డ ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి, కుటుంబ సభ్యలను ఆదరిస్తూ తన మానవీయతను ప్రదర్శించారు. కరీంనగర్ నగరంలోని 58వ డివిజన్‌కు చెందిన సుజాత–త్యాగరాజు దంపతుల కుమార్తె ప్రణీత వివాహం ఈ నెల 13న జరగనున్న నేపథ్యంలో, ముందుగానే తన స్వగృహానికి ఆహ్వానించి సతీమణి సర్ధార్ గోల్డీ బల్బీర్ కౌర్తో కలిసి ఆశీర్వదించి, ఇచ్చిన మాట ప్రకారం రూ.25,000 నగదును కట్నంగా అందజేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారి భవిష్యత్తు సుఖ సంతోషాలతో నిండాలని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో సన్నిహితంగా మాట్లాడుతూ వారి సమస్యలను కూడా తెలుసుకుని, ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజల విశ్వాసమే తనకు అతిపెద్ద బలం. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాట తన బాధ్యత. ప్రజలు నమ్మి ఎన్నుకున్న తర్వాత ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి రాజకీయ నాయకుడి కర్తవ్యమై ఉండాలని సర్దార్ రవీందర్ సింగ్ స్పష్టం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం, వారి సంతోషంలో భాగస్వామ్యం కావడం నిజమైన ప్రజా సేవ అని పేర్కొన్నారు. నగర ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో వరుసగా ఆరు సార్లు కార్పొరేటర్‌గా గెలిపించారని గుర్తుచేస్తూ, ఆ నమ్మకాన్ని ఎప్పటికీ నిల బెట్టుకుంటానన్నారు. స్థానికులు మాట్లాడుతూ పెళ్లికి ముందే స్వయంగా వెళ్లి పలకరించి సహాయం చేయడం అరుదైన విషయం అని, ఇది నిజమైన ప్రజా నాయకత్వానికి నిదర్శనమని ప్రశంసించారు.

## మహాశక్తి ఆలయంలో హిందూ సమ్మేళనం

### -పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ పట్టణంలోని (చైతన్యపురి బస్తి )హిందూ సమ్మేళనం శ్రీ మహాశక్తి దేవాలయ ప్రాంగణ ఆవరణలో ఘనంగా జరిగింది. హిందూ సమ్మేళనానికి ప్రధాన వక్త గా హాజరైన ఆర్‌ఎస్ఎస్ ప్రాంత బౌద్ధిక్ ప్రముక్ జయదేవ్ జి మాట్లాడుతూ హిందూ సమాజం కులాలుగా విడిపోకుండా ఐక్యతతో ముందు కొనసాగాలన్నారు. హిందూ ఐక్యతే హిందూ సమాజానికి, ప్రజానీకానికి వెయ్యి ఏనుగుల బలమన్నారు. సనాతన ధర్మాన్ని, సంస్కృతి ,సాంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. స్వధర్మం పట్ల అంకితభావం , సేవా గుణం పెంపొందించడం మే లక్ష్యంగా హిందూ సమ్మేళనాల నిర్వహణ జరుగుతుందన్నారు. వందేళ్ళ ఆర్ఎస్ఎస్ ప్రయాణం పూర్తిగా దేశ హితం, సంస్కృతి సాంప్రదాయాల, ధర్మ పరిరక్షణ ధ్యేయంగా కొనసాగిందన్నారు. ప్రస్తుతం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పంచ పరివర్తన్ విషయాలతో సమాజంలోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు. ఇట్టి కార్యక్రమంలో చైతన్యపురి హిందూ సమ్మేళన సమితి బాధ్యులు, ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా జువ్వాడి



**ముద్ర, కోరుట్ల:**

రాష్ట్ర వెలమ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మ న్ గా కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా జువ్వాడి మాట్లాడుతూ ఇంత పెద్ద పదవిని అందించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి సత్సంబంధాలు కలిగి ఉండి పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఏపీఐఐసీ డైరెక్టర్ గా కూడా పనిచేశారు. కోరుట్ల, మెట్పల్లి కి చెందిన మున్సిపల్ చైర్మన్ లు తిరుమల వసంత గంగాధర్, మైలారపు లింబాద్రి, పార్టీ నాయకులు, కార్యకర్తలు జువ్వాడి నర్సింగరావు కు అభినందించి, శాలువాతో సన్మానించారు.

## మొక్కజొన్న కొనాలని రాస్తారోకో

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

మొక్కజొన్న పంట చేతికందింది మూడు నెలలు కావస్తున్నా కొనుగోళ్లు చేపట్టనందుకు నిరసనగా రైతులు 62వ జాతీయ రహదారిపై రాస్తా రోకో చేశారు. దిలావర్ పూర్ మండలంలో 62వ జాతీయ రహదారిపై చేపట్టిన ఆందోళనతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మూడు మాసాలవుతున్నా మొక్కజొన్నలు కొనుగోలు చేయని కారణంగా తమ పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క అకాల వర్షాల కారణంగా తడిచిపోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి అక్కడికి వచ్చి రైతులకు నచ్చచెప్పే యత్నం చేశారు. ఐతే కలెక్టర్ వచ్చి హామీ ఇస్తే తప్ప నిరసనలు విరమించబోమని స్పష్టం చేశారు. తహసీల్దార్ శ్రీకాంత్ చొరవతో కలెక్టర్ భవేష్ మిశ్రా ఆందోళనలకు నేతృత్వం వహిస్తున్న గుండంపల్లి సర్పంచ్ తక్కల రమణారెడ్డితో ఫోన్ లో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో కొనుగోళ్లు చేపడతామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.



## ముస్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ గా చక్రవర్తి బొమ్మ శ్రీరామ్



**ముద్ర, కరీంనగర్ :** రాష్ట్ర ప్రభుత్వం పలు కార్పొరేషన్లకు చైర్మన్లు, వైస్ చైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ గా నియమించింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ శ్రేణులు, మున్నూరు కాపు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సామాజిక సేవలో ఉన్న శ్రీరామ్ చక్రవర్తి బీసీ వర్గాల అభ్యున్నతికి మరింత ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## మంచు కొండల్లో చిన్నారి కూచిపూడి నృత్యం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఓ వైపు సముద్ర మట్టానికి 3950 మీటర్ల ఎత్తు, మరో పక్క మైనస్ 15 డిగ్రీల చలి లో ఆరో తరగతి చదువుతున్న చిన్నారి నృత్యం చేసి పలువురి ప్రశంసలు పొందుతోంది. నిర్మల్ కు చెందిన భుజంగ నరేష్, సరితారాణి దంపతుల కుమార్తె వరేణ్య. నరేష్ జాఫ్రాపూర్ లో ఉపాధ్యాయుడు కాగా, సరితా రాణి ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. నిర్మల్ కు చెందిన నవ్య వినయ్ కుమార్ వద్ద శిక్షణను ఆరేళ్ల వయసునుండే పొందుతున్నారు. ఇటీవల జమ్మూ కాశ్మీర్ లోని బారాముల్లా జిల్లా గుల్మార్గ్ లో ఆఫావత్ పర్వత శ్రేణుల్లో ఆమె నృత్యం చేసి తన ప్రతిభను చాటుకున్నారు. ఎముకలు కొరికే చలిలో చిన్నారి చేసిన సాహసం పట్ల పలువురు చిన్నారిని అభినందిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రదర్శనలను ఇవ్వనున్నట్లు చిన్నారి తల్లి సరితా రాణి తెలిపారు.

## తెలుగు సాహిత్య మహాసభల సమన్వయకర్తగా వెంకట్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



శ్రీశ్రీ కళావేదిక 7వ ప్రపంచ తెలుగు సాహి త్య మహాసభలకు సమన్వ యకర్తగా సంస్కృత భాషా ప్రచార సమితి, ఆదిలాబాదు, నిజామాబాదు ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షుడు బి. వెంకట్ నియమితుల య్యారు. శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 7 వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు జూన్ 6,7 తేదీల్లో గ్లోబల్ యూనివర్సిటీ, రాజమండ్రిలో జరగనున్నాయి.

## ప్రతీ ధాన్యం గింజ కొంటాం

### - కలెక్టర్ రాహుల్ శర్మ



**మహదేవపూర్, ముద్ర:**

తడిసిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. బుధవారం మహదేవపూర్, సూరారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం పరిస్థితిని స్వయంగా పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆందోళన చెందొద్దని తెలిపారు. ధాన్యం కొనుగోలు, రవాణా, దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం కాకుండా పర్యవేక్షణకు మిల్లుల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే రవాణా చేయాలని డీఎంకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం రవాణాకు లారీలు అందుబాటులో ఉంచాలని, ఇబ్బంది లేకుండా చూడాలని రవాణా కాంట్రాక్టర్ ను ఆదేశించారు. తడి సిన ధాన్యాన్ని తక్షణమే కాటారంలోని అన్నపూర్ణ పారబాయిల్ రైస్ మిల్ తరలించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, ఎంపీడీఓ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట దగ్ధం



**ముద్ర, కోరుట్ల;** జాతీయ జిల్లా మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి మొక్కజొన్న పంట దగ్ధమైంది. సంఘటన స్థలాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు. వేంపల్లి గ్రామానికి చెందిన గుమ్ముల లత అనే రైతు పండించిన పంటను కోసి కుప్పగా పోశారు. ప్రమాదవశాత్తు మంగళవారం షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక రైతులు గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, పంట పూర్తిగా కాలిపోయింది. చేతికొచ్చిన పంట కాలిపోవడంతో బాధితురాలు కన్నీటి పర్యంతమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కాలిపోయిన పంటను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. జరిగిన నష్టంపై పూర్తి వివరాలను సేకరించి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించి, ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** విద్యుత్ వినియోగంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని విద్యుత్ శాఖ ఎస్ ఈ సుభాష్ సూచించారు. విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించాలని అన్నారు. ఇందుకోసం సిబ్బంది అంకితభావంతో పని చేయాలని కోరారు. లైన్ల మరమ్మతులు, ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు నిరంతం మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఈ నాగరాజు, అకౌంట్స్ అధికారి దిగంబర్, ఈ డీశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలులో తీవ్ర జాప్యం

### -ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



**ముద్ర, కోరుట్ల:**

మొక్కజొన్న కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తు న్నారని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ఆరోపించారు. బుధవారం కోరుట్ల వ్యవసాయ మార్కెట్ ను రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వక పోగా సకాలంలో యూరి రైతు అప్పులు చేసి పంట పండిస్తే, దాన్ని కొనక పోతే ఎలా అని ప్రశ్నించారు. మీడియా మేనేజ్మెంట్ వదిలి గ్రౌండ్‌లోకి వచ్చి రైతుల సమస్యలు తెలుసుకోండి అంటూ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్‌లో నిల్వ ఉన్న మొక్కజొన్న తడిసిపోతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు ప్రారంభించకపోతే రైతులకు పెద్ద ఎత్తున నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. మొక్కజొన్న కొను గోలు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని మార్క్‌ఫెడ్ డీఎం కు ఫోన్ చేసి కోరారు ఎమ్మెల్యే వెంట మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, నాయకులు చీటి వెంకట్రావు, కౌన్సిలర్ కొక్కెర వెంకటేష్, ఎలుగూరి కిరణ్, నీలి శ్రీనివాస్, గేల్లె గంగాధర్, దశరథం, ఏఓ నాగమణి ఉన్నారు.

## యూసుఫ్ నగర్ లో బడి బాట

**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామంలో మండల విద్యాధికారి గంగుల నరేశం సర్పంచ్, ఉపసర్పంచ్ లు బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలోని బడి ఈడూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. యూసుఫ్ నగర్ లో పదవ తరగతి నందు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. సర్పంచ్ పల్లి రాణి రాజు, ఉప సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ తుకారాం గౌడ్, పంచాయతీ కార్యదర్శి పృథ్వి, వార్డు మెంబర్ ప్రణీత్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పవన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 07.05.2026
www.mudranews.in | @mudranews



తూర్పు తెలంగాణ
వరంగల్, ఖమ్మం, నల్గొండ
Warangal,Khammam,Nalgonda

**గుండె ఆరోగ్యం :**



తగిన నిద్ర పొందండి రోజుకు 7–8 గంటల నిద్ర మెదడు ఆరోగ్యానికి కీలకం.నిద్రలేమి ఆలోచనా సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది.

## నృసింహుని సన్నిధిలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి




**ముద్ర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ ఆయనకు సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ విశేషాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సుభిక్షం, శాంతి, అభివృద్ధి కోసం స్వామి వారి ఆశీస్సులు కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## 8,9,10 తేదీల్లో మెగా జాబ్ మేళా



**బీబీనగర్, ముద్ర:** భువనగిరి నియోజకవర్గం పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి వీలుగా భువనగిరిలో మెగాజాబ్ మేళా ను నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ నాయకుడు పొట్టోల శ్యామ్ గౌడ్ తెలిపారు. కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8,9,10 తేదీలలో నిర్వహించే ఈ జాబ్ మేళాను సద్విని యోగం చేసుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తనయ, కుంభం ఫౌండేషన్ అధ్యక్షురాలు కుంభం కీర్తిరెడ్డి సహకా రంతో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు వివరించారు. భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ హైస్కూల్లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను భువనగిరి నియోజకవర్గం లోని నిరుద్యోగ యువతీ యువకులు సద్విని యోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఒక గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కీర్తి రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇన్ని సంవత్సరాల్లో ఏ ఒక్కరు కూడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించ లేదని, ఈ కార్యక్రమం నిర్వహించడం భువనగిరి నిరుద్యోగ యువతీ యువకులకు గొప్ప అవకాశమని అన్నారు. దేశంలోని పలు ప్రముఖ కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకు రావడం గొప్ప విషయమని శ్యామ్ గౌడ్ అన్నారు. భువనగిరి నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు కుంభం ఫౌండేషన్ తరపున అధ్యక్షురాలు కుంభం కీర్తి రెడ్డి ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా వున్నారని ఆయన తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వచనాలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని 25వ వార్డ్ కౌన్సిలర్ బెండలాల్ రాజ్ బెండస్వరూపల కుమారుడు సిద్ధార్థ వివాహం బుధవారం నాగారంలో జరగగా కాంగ్రెస్ పార్టీ నాయకులు హీరే కార్ శ్రీను హాజరై వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా గిరీష్ కుమార్ గౌడ్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజ్ ముదిరాజ్, నాయకులు బోయిని బాలయ్య, నరసింహ, మహేష్, సిద్ధులు, గోపే ఎల్లయ్య పాల్గొన్నారు.

# రైతును రాజు చేయాలన్నదే లక్ష్యం

● ఎమ్మెల్యే మందుల సామెల్



**ముద్ర, తుంగతుర్తి:** ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతును రాజును చేయాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వ నడుస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు .ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు– మార్కెటింగ్ శాఖ ప్రగతి నివేదిక కార్యక్రమం బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాత ప్రభుత్వ నడుస్తుందని అన్నారు. రూ. లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరి వేసిన రైతులకు మద్దతు ధర కల్పిస్తూ సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. సమావేశానికి ముందు జాతీయ గీతాలాపన అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయ రంగంలో నూతన పరిజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేశారు అలాగే వ్యవసాయంలో ఏ పంటలు ఏ వాతావరణంలో పండించాలో అలాగే రైతు బీమా సబ్సిడీ పథకాలు పంట రుణాలపై అవగాహన కల్పించారు. అనంత రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తుంగతుర్తి మద్దిరాల నూతనకల్ మండలాల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్, తహసిలార్లు దయానందం, సబిత, నూతనకల్ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏడిఏ రమేష్ బాబు, మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేష్ కుమార్, ఏఈఓలు, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తుంగతుర్తి సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, తుంగతుర్తి మద్దిరాల నూతనకల్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రేగటి రవి, పచ్చిపాల వెంకన్న, నల్లు రామచంద్రారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి కేటీఆర్ కు లేదు

**మీరు కట్టిన ప్రాజెక్టులలో మీ కుటుంబానికి ఎంత వాట ఉందో చెప్పాలి**
**ప్రభుత్వాన్ని, సీఎంను విమర్శిస్తే రాజకీయంగా వేటాడి సమాధి కడతాం**
**కేటీఆర్ పై విరుచుకపడ్డ ఎమ్మెల్యే మందుల సామెల్**



**ముద్ర, తుంగతుర్తి:** . సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి కేటీఆర్ కు లేదని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు మీడియాతో మాట్లాడుతూ పదేళ్లు బీఆర్ఎస్ పాలనలో రైతులను నయవంచన చేసిన నాయకులే నేడు రైతు సమరభేరి పేరుతో సభలు పెట్టడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మీ ప్రభుత్వ హయాంలో కట్టిన ప్రాజెక్టులలో మీ కుటుంబ సభ్యులకు ఎంత వాట ఉందో ప్రజల ముందు చెప్పాలని సవాల్ విసిరారు. నాడు మలిదశ తెలంగాణ ఉద్యమం కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులను అణిచివేసి వారిని దూరం పెట్టి మీ కుటుంబం పదవులు అనుభవించి తెలంగాణ రాష్ట్రాన్ని మొత్తం లూటీ చేసిందని విమర్శించారు. తోడబుట్టిన చెల్లెనే తెలివి లేదు? సోయి లేదని విమర్శిస్తుంటే సమాధానం చెప్పలేని దద్దమ్మవు నువ్వు అని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కేటీఆర్ కు తెలివి లేదని మాట్లాడిన వాటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని గాని.. రేవంత్ రెడ్డి పైన గాని ఆచితూచి మాట్లాడకుంటే ప్రజలు తగిన సమయంలో తగిన రీతిలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, జిల్లా నాయకులు రేగటి రవి, వివిధ మండలాల సర్పంచులు,అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సహాయ ఉపకరణాలు సద్వినియోగం చేసుకోవాలి

● భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** దివ్యాంగులు సహాయ ఉపకరణాలు సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం రావిభద్రారెడ్డి ఫంక్షన్ హాల్ లో జిల్లా మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వికలాంగుల కార్పొరేషన్, అలింకో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సి ఎస్ ఆర్ నిధులతో వికలాంగులకు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వం ద్వార దఫా దఫాలుగా పంపిణీ చేస్తున్నామని ఇంకా పరికరాలు రాని వారు బాధ పడొద్దని త్వరలో మిగిలిన దివ్యాంగులకు అందరికి లబ్ది చేకూరేటట్లు చూస్తానన్నారు. తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో దివ్యాంగుల కోసం ఇంత విస్తృత స్థాయిలో సహాయ ఉపకరణాలు పంపిణీ చేయడం ఇదే తొలిసారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే దివ్యాంగురాలు రజనీకి ఉద్యోగం కల్పించే ఫైల్ పైన తొలి సంతకం చేసిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగాల్లో దివ్యాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్స్, ఉన్నత విద్యలో ఐదు శాతం రిజర్వేషన్, ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం, రాజీవ్ యువ వికాసంలో ఐదు శాతం రిజర్వేషన్ లని దివ్యాంగుల సంక్షేమ ఆత్మగౌరవ ప్రతీక రేవంతన్న కల్పించారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే కళ్యాణ లక్ష్మి తో పాటు అదనంగా వివాహ ప్రోత్సాహక బహుమతి కింద రూపాయలు రెండు లక్షలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అని పేర్కొన్నారు. ప్రస్తుతం 40 శాతం వైకల్యం ఉన్నవారికి కూడా స్కూటీలతో పాటు ఉపకరణాలు వాహనాలు అందిస్తున్నామన్నారు. కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేయడం మంచి పరిణామమన్నారు. జిల్లాలో కార్పొరేషన్ ద్వారా 68. అలింకో సంస్థ ద్వార 518 మందికి పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహ రావు. గ్రంథాలయ సంస్థల ఛైర్మెన్ అవేజ్ చిస్తి, లోకల్ ఈడి ఎస్. రావు. సీడీపీఓలు వెంకట రమణ, శైలజ, స్వరాజ్యం, నాజీ, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, అలింకో సిబ్బంది, 600 మంది దివ్యాంగులు పాల్గొన్నారు.

# 'పెంచిన గ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలి'



**ముద్ర, ఖమ్మం:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు మాట్లాడుతూ సామాన్యులపై మోయలేని భారాన్ని మోపుతుందని, ధరల పెంపుపై ఇప్పటికే కమ్యూనిస్టు పార్టీ పోరాటాలకు సిద్ధమవుతుందన్నారు. ప్రభుత్వాలు ప్రజల హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, తక్షణమే పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి సామాన్యులకు ఊరటనివ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తాసీల్దార్ సమ్మయ్యకు అందజేశారు. సీపీఐ సీనియర్ నాయకులు నల్లజాల సత్యనారాయణ, అలవాల సీతారాంరెడ్డి, సొల్లు పుల్లయ్య, సిద్ధారపు సుబ్బారెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, ముదిగొండ బాలకృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కాటూరి రాము, కుంజా నాగరాజు, భూక్యా నాగేశ్వరరావు, బద్రి, సింగబోయిన వెంకటేశ్వర్లు, పెనుబల్లి మండల కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట సింగిల్‌విండో చైర్మన్ గా రాంరెడ్డి



**ముద్ర, యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట పిఎసిఎస్ చైర్మన్ గా ఉమ్మడి రాంరెడ్డి బుధవారం యాదగిరిగుట్ట కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి వారి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం పిఎసిఎస్ పాలకవర్గానికి నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు ప్రయత్నించగా తామంతా కోర్టుకు వెళ్లామని గౌరవ హైకోర్టు వారు తమకు అనుకూలంగా తీర్పునిచ్చారని అన్నారు తిరిగి తమనే ఎన్నికలు జరిగే వరకు బాధ్యతలు చేపట్టాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని అన్నారు ప్రభుత్వం ఇప్పటికైనా పిఎసిఎస్ లకు ఎన్నికలు జరపాలని అన్నారు. నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ఎన్నికలు జరిపితేనే రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. రైతులకు సకాలంలో యూరియా విత్తనాలు అందించేందుకు తగిన పంట పెట్టుబడి రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులకు ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా వారిని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ సందర్భంగా తిరిగి పిఎసిఎస్ చైర్మన్ గా ఎన్నికైన ఇమ్మడి రామ్ రెడ్డికి పలువురు గ్రామాల సర్పంచులు రైతులు నాయకులు పెద్ద ఎత్తున పూలమాలలు శాలువాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ముఖ ఆధారిత గుర్తింపును రద్దు చేయాలి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వృద్ధాప్య పెన్షన్ల కోసం ప్రవేశపెట్టిన ముఖ ఆధారిత గుర్తింపు ప్రక్రియ రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం, బస్వాపురం గ్రామాలలో పెన్షన్ దారుల సమస్యలను తెలుసుకున్న అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వేలిముద్రలు సరిపోలని వృద్ధులు, దివ్యాంగులకు పెన్షన్ పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేపంతో ముఖ ఆధారిత గుర్తింపు పెట్టడం వల్ల ఫేస్ రికగ్నిషన్ సరిగ్గా పనిచేయక పోవడం వల్ల వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏక్కడో పెన్షన్ల పంపిణీలో జరిగిన అవినీతి సాకుగా చూపించి మొత్తం పెన్షన్ దారులను ఇబ్బందులు పెట్టడం సరికాదని, పెన్షన్ల కోసం ఎర్రటి ఎండలో వృద్ధులు అవస్థలు పడుతున్నారని, ఫోన్లో ముఖం ఆధారితం రాకపోవడం వల్ల పలుమార్లు ఆఫీస్ చుట్టూ తిరిగి తిరిగి అలసిపోతున్నారన్నారు. ఇప్పటికైనా ముఖ ఆధారిత గుర్తింపు తీసివేసి పెన్షన్ల దారులకు పాత పద్ధతిలో పెన్షన్లు ఇవ్వాలని కోరారు.

## ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

**ముద్ర, సూర్యాపేట :** జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా జాప్యానికి తావులేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సూర్యాపేట మండలం రాయిని గూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, తూకాలు, మరియు రవాణా ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. రైస్ మిల్లర్ల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. లారీలు మిల్లుల వద్ద గంటల తరబడి వేచి ఉండకుండా చూడాలని, నిబంధనలు అతిక్రమించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడవకుండా ఉండేందుకు సరిపడా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు సైతం తమ ధాన్యాన్ని ఆరబెట్టి, నాణ్యతా ప్రమాణాల ప్రకారం కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపును (ట్రాన్స్‌పోర్ట్) ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పౌరసరఫరాలశాఖ అధికారులను ఆదేశించారు. గడువులోగా ధాన్యం సేకరణ పూర్తి చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఎస్ఓ మోహన్ బాబు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ లాలు, ఏఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్ పోస్ట్ లు

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ




**ముద్ర, సూర్యాపేట:** పశువుల అక్రమ రవాణా, ఇసుక, ధాన్యం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా పోలీసు శాఖ పటిష్ఠ నిఘా ఉందని ఎస్పీ నరసింహ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7 చెక్ పోస్టులలో 24 గంటలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తునట్లు తెలిపారు. మోతే పోలీస్ స్టేషన్ పరిధి మామిళ్లగూడెం టోల్గేట్ వద్ద అంతర్ జిల్లా చెక్ పోస్ట్ జిల్లా ఎస్పీ నరసింహ సందర్శించి వాహనాల తనిఖీలను పరిశీలించారు. చెక్ పోస్ట్ రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ అక్రమ రవాణా నిర్మూలన లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రాంతాలలో ఏడు అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్పోస్టులు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ చెక్ పోస్ట్ ల ద్వారా అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానత వ్యక్తులకు కదలికలపై పూర్తిస్థాయి నిగా ఉంచామని అన్నారు. వరి ధాన్యం అక్రమ రవాణా జరగకుండా, పీడీఎస్ బియ్యం, ఇసుక, పశువుల అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిగా ఉంచి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడినట్లైతే అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ చెక్ పోస్ట్ నందు పోలీస్ సిబ్బంది 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు.ఎస్పీ గారి వెంట కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, మోత ఎస్సై అజయ్ కుమార్, చెక్ పోస్ట్ విధులు నిర్వహణ సిబ్బంది ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 07.05.2026
www.mudranews.in | @mudranews



గుండె ఆరోగ్యం:

ఒత్తిడిని తగ్గించండి
ధ్యానం, యోగా, శ్వాసాభ్యాసాలు ఒత్తిడిని తగ్గిస్తాయి.
అధిక ఒత్తిడి గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది



# బాలల హక్కులను కాలరాయొద్దు

**- రాష్ట్ర కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** బాలల హక్కులను కాలరాయొద్దని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మెదక్ కలెక్టరేట్ మీటింగ్ హాల్లో బుధవారం ఉమ్మడి జిల్లా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెదక్, సిద్ది పేట, సంగారెడ్డి జిల్లాలో బాలకార్మిక వ్యవస్త, బాల్య వివాహాలు, డ్రగ్స్ నియంత్రణ, కిషోర బాలికల ఆరోగ్యం, విద్య, పాఠశాలల్లో డ్రాప్ ఔట్ తగ్గించడం, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, హాస్టల్లో ఫుడ్ పాయిజన్ సంఘటనలు, సాధారణ ప్రసవాలు, పోక్సో కేసుల నమోదు వివరాలు, అతి ప్రమాద మైనర్ డ్రైవింగ్ అంశాలపై ఉమ్మడి జిల్లా అధికారులనుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ బాలలు సురక్షితంగా, ఆరోగ్యంగా, గౌరవప్రదంగా ఎదగడానికి అవసరమైన అన్ని హక్కులను కాపాడటం ప్రభుత్వంతో పాటు సమాజం మొత్తం బాధ్యత అని స్పష్టం చేశారు. బాలల హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా, ఎలాంటి ఒత్తిడులు ఉన్నా కూడా కమిటీ కఠిన చర్యలు తీసుకుంటుందని ఆమె హెచ్చరించారు.

చిన్నారులు మన సమాజానికి భవిష్యత్తు బలమైన స్థంభాలు, వారి శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి అనుకూల వాతావరణం కల్పించడం అత్యవసరమన్నారు. అయితే ఇటీవల కొంతమంది బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తూ బాలలపై దౌర్జన్యాలు, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, విద్యా హక్కుల నిర్లక్ష్యం వంటి ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళనకరం అన్నారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుత. జిల్లాలో బాలల రక్షణ యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా పనిచేసేలా సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. పాఠశాలలు, హాస్టళ్లు, బాలల సంరక్షణ గృహాలు, అనాథాశ్రమాలు వంటి ప్రదేశాల్లో అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహిస్తూ, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నామని వెల్లడించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతీ ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. బాలల హక్కుల పరిరక్షణకు నిరంతరం పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు వందనా గౌడ్, చందన, సరిత, అపర్ణ, అగర్వాల్, వచన్ కుమార్ సిద్దిపేట డిఆర్ఓ నాగరాజమ్మ, మెదక్ అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సంగారెడ్డి ఏ ఎస్పీ చైతన్య రెడ్డి, మెదక్ జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, సిద్దిపేట అడిషనల్ ఎస్పీ ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** బ్యాంకుల్లో భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని బ్యాంకు, గోల్డ్ లోన్ సంస్థల మేనేజర్లతో కలిసి భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.బ్యాంకుల్లో సీసీటీవీ కెమెరాలు, ఆటోమేటిక్ అలారం సిస్టమ్స్, యాక్సెస్ కంట్రోల్ వంటి ఆధునిక భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, మెటల్ డిటెక్టర్లు అమర్చాలని పేర్కొన్నారు. బ్యాంకుల్లో భద్రతా లోపాలను గుర్తించేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ బృందాలు జిల్లాలోని బ్యాం కులను తనిఖీ చేసి సీసీటీవీ వ్యవస్థలు, అలారం సిస్టమ్స్, భద్రతా సిబ్బంది పనితీరును సమీక్షించనున్నాయని, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని బ్యాంకు యాజ మాన్యానికి సూచించారు. బ్యాంకుల వద్ద అర్మ్డ్ గార్డులు, ఏటీఎం కేంద్రాల వద్ద సె క్యూరిటీ గార్డులను తప్పనిసరిగా నియమించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డి ఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన సొసైటీ చైర్మన్



**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డి జిల్లాలోని దామరంచ సొసైటీ చైర్మన్‌గా తిరిగి బుధవారం సొసైటీ కార్యాలయంలో కమలాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. పాత చైర్మన్లనే కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో తిరిగి కమలాకర్ రెడ్డి చైర్మన్ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్లను స్థానిక నాయకులు, రైతులు సన్మానించారు.

# శాంతి స్థాపనకు ఎంపీజే కృషి..

**- రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ మజీద్ షోయబ్**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** సమాజంలో శాంతి స్థాపనకు ఎంపీజే ( మూవ్ మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ) కృషి చేస్తోందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ మజీద్ షోయబ్ తెలిపారు. బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ సామాజిక బాధ్యత పట్ల యువతకు అవగాహన, చైతన్యం తెస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ సాధనలో ఎంపీజే కూడా భాగస్వామ్యం అయ్యిందని తెలిపారు. సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఎంపీజే ఎప్పుడు ముందుటుందని తెలిపారు. అలాగే ఎన్నో రోజుల నుండి ఎవరి సహకారం లేకుండా జైల్లోనే మగ్గుతున్న నిరుపేద ఖైదీలను కూడా విడిపించడం ఎంపీజే బాధ్యత తీసుకుందాన్నారు. ప్రస్తుతం కుల మతాలకు అతీతంగా ఎస్ ఐ ఆర్ కార్యక్రమం కోసం రాష్ట్ర వ్యా గా హెల్ప్ డెస్క్ ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న ఎంపీజే తన వంతు సహాయంగా పరిష్కహరానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా ఎంపీజే నూతన కమిటీ ని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా మొహమ్మద్ అమీర్, ప్రధాన కార్యదర్శిగా, అలా ఉర్ రహేమాన్, ఉపాధ్యక్షులుగా గౌస్ పాషా, మొహమ్మద్ బషీర్, జాయిన్ సెక్రటరిలుగా ఆరిఫ్ ముజఫ్ఫార్, సయ్యాద్ జహీర్, కలీం రిజ్విట్రే, ట్రేజరర్ మొహమ్మద్ ఫరూక్ అలీ, పీఆర్ ఓ గా సాజిద్ పాషా, సభ్యులుగా అబ్దుల్ ఖాదర్, మెహమ్మద్ అన్వర్, అక్బర్ నవాబ్, అయ్యుబ్, ఉస్మాన్, షార్ఫుద్దిన్ తదితరులు నియమించినట్టు తెలిపారు. నూతన కమిటీ శాంతి స్థాపనకు కృషి చేయాలన్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్తలు..

# జగిత్యాలలో రోడ్డెక్కిన మొక్కజొన్న రైతులు



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ లో మొక్కజొన్న కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం రోడ్డుపై బైఠాయించారు. రైతుల ఆందోళనతో జగిత్యాల పట్టణంలోని బీట్ చౌరస్తాలో నిజామాబాద్ – జగిత్యాల రహదారి పై రాకపోకలు . ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 20 రోజుల క్రితం మొక్కజొన్న పంటను విక్రయించేందుకు జగిత్యాల బీట్ కు తరలించిన ఇంకా కొనుగోళ్లు చేయటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆకాల వర్షం వస్తే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి మొక్కజొన్న కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విషయాన్ని తెలుసుకున్న జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించగా నిరసనను విరమించారు.

# అన్నదాతలను పట్టించుకోని ప్రభుత్వం



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను పట్టించుకోవడంలేదని జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్ ఆరోపించారు. జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట చేతి కొచ్చి 20 రోజులు గడిచినా గింజ కూడా కొనుగోలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు అయిల్నేని ఆనంద్ రావు, మోహన్, శ్రీపాల్, జలంధర్, రాజమల్లు, మల్లేశం, గంగాధర్, తిరుపతి, సత్తన్న, భాగ్య, మల్లయ్య పాల్గొన్నారు.

## రేపు సంగారెడ్డిలో జాబ్ మేళా




**ముద్ర ప్రతినిధి, మెదక్:** యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి సంగారెడ్డి తారా డిగ్రీ కాలేజ్ లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బుధవారం మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గల ఎంపీడీఓ లు పంచాయత్ సెక్రటరీల ద్వారా గ్రామాలలో చాటింపు చేయించాలని, మెదక్ జిల్లాలో గల గ్రామాలలో ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. satg.telangana.gov.in/prajapalana 3 వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రమేష్ గంగాల, ఉపాధి కల్పన అధికారి రామరాజు, పరిశ్రమల శాఖ అధికారి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అభినందించిన బీఆర్ ఎస్ నాయకులు



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** పదో తరగతిలో మండల టాపర్ గా నిలిచిన విద్యార్థని బీఆర్ ఎస్ నాయకులు అభినందించారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని సిరసనగాండ్ల గ్రామానికి చెందిన మహమ్మద్ అజీమ్ కూతురు సుహనా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచింది. ఈ సందర్భంగా బీ ఆర్ ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి, పార్టీ కొం డపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ బుధవారం ఆమెను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నతమైన చదువులు చదివి మన రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో సుహనాకు తమంత అండగా ఉంటామని తెలిపారు. వారి వెంట బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు రాముల భాను, ఆర్ఎంపీ డాక్టర్ రహీముద్దీన్ తదితరులు ఉన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు నిబంధనలు పాటించాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలో నూతన ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు ప్రభుత్వ శాఖల కేటాయింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన జిల్లా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు క్రమంగా జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్ ఇతర సౌకర్యాలను తప్పకుండా అందించాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించని ఏజెన్సీలను బ్లాక్లిస్టులో పెట్టి, వేరే ఏజెన్సీలకు అందిస్తామన్నారు. జిల్లా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై ప్రతి మూడు నెలలకు సమీక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రామరాజు, జిల్లా విద్యాధికారి శ్రీరామ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, లేబర్ ఆఫీసర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డి జిల్లాలోని తాడ్వాయి మండలం ఏండ్రియల్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలోని లబ్ధిదారులు పడమటి కౌసల్య నిర్మించుకుంటున్న ఇంటి పనులను పరిశీలించి, నిర్మాణ పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా ఇళ్లను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యమన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com